# మాంత్రికుడూ రాజకుమారీ (అను) నానిగాడి ప్రేమ కథ

వసుంధర

నా పేరు నాని. బామ్మయితే ఎప్పుడూ నానిగాడంటుంది మిగతా అందరూ నాని అని పిలుస్తారు. అందరూ అంటే అమ్మ, నాన్న, బాబాయి, అత్తయ్య, చుట్టుపక్కల వాళ్ళు. చుట్టుపక్కలవాళ్ళలో చిన్నపిల్లలు కూడా ఉన్నారు. మా యింట్లో నేనొక్కడినే చిన్నపిల్లాణ్ణి. అందుకని నేనంటే గారం.

ఎంతగారం చేసినా నేను చెడిపోలేదు. నాకిప్పుడు అయిదేళ్ల. అక్షరాభ్యాసం జరిగి రెండు నెల్లయింది. అప్పుడే అ ఆ లు, క ఖ లు, గుణింతాలు, ఒత్తులు అన్నీ వచ్చేశాయి. మా పక్కింట్లో రాజిగాడున్నాడా - వాడు నాకంటే ఆర్నెల్లు పెద్ద ఇంకా వాడు యారమాల దగ్గరే ఉన్నాడు.

ఈ విషయం అస్తమానం యింట్లో చెప్పి బామ్మనన్ను మెచ్చుకుంటూంటుంది. బామ్మంటే నాకు చాలా యిష్టం. ఎందుకంటే బామ్మకు అన్నీ మంచి బుద్ధులే!

పాపం - బామ్మ తెల్లారకట్లే లేచిపోతుంది. చలిలో చన్నీళ్ళ స్నానం చేస్తుంది. అయినా సరే అమ్మ నన్ను పొద్దున్నే లేపేయబోతే - "చంటికుర్రాడు వాణ్ణి కాసేప్పడుకోనియ్యవే -" అంటుంది. అమ్మ నాకు చన్నీళ్ళు పోస్తానంటే తిట్టి తనే నా కోసం వేణ్ణీళ్ళు కాచిస్తుంది. తాము కష్టపడుతూ కూడా అలాంటి కష్టాలు ఇతరులకు కలిగించకూడదనుకునే వాళ్ళు మంచి వాళ్లట తను అలాంటి మంచిదాన్నని బామ్మే నాకు చెప్పింది.

ఈ విషయం అమ్మకు చెబితే ఒప్పుకోదు. మంచి వాళ్లెప్పుడూ తమగురించి గొప్పలు చెప్పుకోరుట. "నేను చాలా మంచి" అని చెప్పుకునే వాళ్ళందరూ చెడ్డవాళ్ళట

అమ్మ మాటలు విని నేను సందిగ్ధంలో పడిపోతాను. ఎవరైనా ఒకమాట చెబితే అందులో సగం నిజం, సగం అబద్ధం ఉంటే విన్నవాళ్ళకు ఆ మాట నిజమో, అబద్ధమో తేల్చుకోవడం కష్టం. దాన్నే పెద్దవాళ్ళు సందిగ్ధంలో పడడం అంటారు.

ఇంతకీ అమ్మ మాటలకు నేను సందిగ్ధంలో ఎందుకు పడ్డానంటే బామ్మ తను మంచిదాన్నని అస్తమానూ చెబుతూంటుంది. అయినా బామ్మ చెడ్డదని నాకు అనిపించదు. ఎందుకంటే బామ్మకు నేనంటే ఎంతో యిష్టం. నాకూ బామ్మంటే అంతే.

చిన్నపిల్లలు దేవుడితో సమానం. చిన్నపిల్లలంటే యిష్ట పడేవాళ్ళు దేవుడంటే యిష్ట పడ్డట్లు. దేవుడంటే యిష్ట పడ్డ వాళ్లు మంచివాళ్లే కదా!

నేనంటే యిష్టపడ్డమే కాదు, బామ్మ యింకా చాలా మంచి పనులు చేస్తుంది. పొద్దున్నే దేవుడికి పూజ చేసుకుని నాకు ప్రసాదం పెడుతుంది. ఆ ప్రసాదం కూడా నా కిష్టమైనవే చేస్తుంది. రోజూ ఒకటే అయితే నాకు నచ్చదని ఒకరోజు పటికబెల్లం, ఒకరోజు కొబ్బరిముక్కలు, ఒకరోజు అరటిపండు......... ఇలా మారుస్తూంటుంది.

అంతేకాదు - చుట్టుపక్కల పిల్లలెవరైనా అన్యాయంగా నన్ను కొడితే అమ్మ నన్నే తిడుతుంది. "ఉత్తినే ఎందుకు కొడతారు ? నువ్వూ ఏదో చేసే ఉంటావు. ఏం చేశావో చెప్పు" అని గదిమేస్తుంది. అప్పుడు బామ్మ "అసలే వాడు దెబ్బలు తిని ఏడుస్తూంటే నువ్వలాగ గదిమేస్తావేమిటే" అంటూ నన్ను దగ్గరగా పిలిచి దెబ్బ ఎక్కడ తగిలింది అని ప్రేమగా అడుగుతుంది.

అసలే దెబ్బలు తిన్నాను. ఆపైన అమ్మతిట్టింది. అలాంటప్పుడు ఎవరైనా ప్రేమ చూపిస్తుంటే నాకు ఏడుపొచ్చేస్తుంది. అందుకని బావురుమని ఏడ్చేశాను. బామ్మ నన్ను ఓదార్చుతుంది. కాసేపటికి నాకు ఏడుపు అయిపోతుంది.


"దెబ్బెక్కడ తగిలిందో చెప్పమ్మా!" అంటుందప్పుడు బామ్మ మళ్ళీ.

అప్పుడు నేను సందిగ్ధంలో పడిపోతాను.

ఎవరో నన్ను కొట్టిన మాట నిజమే కానీ నాకేమీ దెబ్బలు తగల్లేదు. బామ్మంత ప్రేమగా అడిగినప్పుడు దెబ్బలు చూపించకపోతే ఎలా? చాలా సేపు ఆలోచించి ఏ పిక్కల దగ్గరో చూపించి- "ఇక్కడ"! అంటాను.

నిజంగా బామ్మ మంచిది. అమ్మయితే "ఇక్కడ నాకేం దెబ్బ కనిపించటం లేదు." అంటుంది. బామ్మ మంచిది కదా- వెంటనే అక్కడ ఉఫ్ ఉఫ్ అని ఊది" - చాలాపెద్ద దెబ్బ తగిలిందిరా నానిగా-ఇప్పుడు తగ్గిందా అటుంది. బామ్మ అలా ఊదితే నాకు చాలా బాగుంటుంది. అందుకని అలా దెబ్బలు తగిలినప్పుడు బామ్మ దగ్గరకే వెడతాను. నిజంగా దెబ్బలు తగిలినప్పుడు మాత్రం అమ్మ దగ్గరకు వెడతాను. ఎందుకంటే నిజం దెబ్బలు ఊదితే తగ్గవు. వాటికి మందు రాయాలి. ప్లాస్టరు వేయాలి. దెబ్బలకు మందు రాయించుకుని ప్లాస్టరు వేయించుకోవడం నాకు చాలా యిష్టం. మందులూ ప్లాస్టర్లూ బామ్మదగ్గరుండవు. అమ్మదగ్గరుంటాయి. నిజంగా నాకు దెబ్బలు తగిలితే అమ్మ కూడా నన్ను తిట్టదు. ప్రేమగానే మాట్లాడి ఏడిపిస్తుంది.

ఊం ఇంకా బామ్మ ఇంకా ఎన్ని మంచి పనులు చేస్తుందో చెప్పాలిగదా....




రాత్రిళ్ళు బామ్మ నాకు రామాయణం కథ చెబుతుంది. ఆ కథ వింటూంటే ఎంత బాగుంటుందో!

"రోజూ అదే ఏం చెబుతావు?" అని ఎవరైనా అంటే-" చెబితే నాకు, వింటే వాడికి బోలెడు పుణ్యం -" అంటుంది బామ్మ.

బామ్మ అన్ని పనులూ పుణ్యం కోసమే చేస్తుంది. అదికూడా మంచివాళ్ళ లక్షణమే!

కాబట్టి బామ్మ అన్ని విధాలా మంచిది. అందువల్ల అమ్మ బామ్మను చెడ్డదంటే నేను నమ్మకూడదు. అమ్మ అబద్ధం చెప్పిందేమో అనుకోవాలి. కాని నేను సందిగ్ధంలో పడిపోవడానికి కారణం బాబాయి.

బాబాయి అన్నీ తన గురించి గొప్పగా చెప్పుకుంటాడు. కానీ మంచివాడు కాదు. బాబాయి మంచివాడు కాదనేందుకు చాలా సాక్ష్యాలున్నాయి.

బాబాయి అమ్మదగ్గర కూర్చుని బామ్మను వేళాకోళం చేస్తూంటాడు. అమ్మ నవ్వుతూంటుంది. అది చూసినప్పుడల్లా నాకో్కపం వచ్చేసి "పెద్దాళ్ళను వేళా కోళం చేయడం తప్పుకాదూ" అంటాను.

అప్పుడమ్మ నవ్వుతుంది. బాబాయి మాత్రం "గొప్పవాళ్ళు పెద్దాళ్ళని వేళా కోళం చేయొచ్చు. నేనుగొప్పవాణ్ణి-" అంటాడు. అలా అంటాడా మళ్ళీఏ పని మీదైనా బయటకు వెళ్ళేముందు బామ్మకాళ్ళకు దణ్ణంపెడతాడు. బామ్మమంచిది కదా- అందుకని దీవిస్తుంది.

బాబాయి విషయంలో నాకింకోటి అర్థంకాదు. బామ్మ దేవుడికి పూజలు చేస్తుందని అస్తమానూ వేళాకోళం చేస్తాడు. అసలు దేవుడున్నాడా ? ఉంటే మాత్రం ఆ విగ్రహంలోనే ఉంటాడా?" అని కబుర్లు చెప్పి అమ్మను నవ్వించి తనకు పని ఉన్నప్పుడు తనూ దేవుడికి దణ్ణం పెట్టుకుంటాడు.

బాబాయి చెడ్డవాడనుకునేందుకు అసలు కారణాలవి కాదు బామ్మ నన్నెంత ప్రేమగా చూసుకుంటుందో, అంతకంతా బాధలు పెడతాడు నన్ను బాబాయి.

బాబాయికి చదువైపోయిందిట ఇంక ఉద్యోగం రావాలిట. ఉద్యోగం వస్తే యింట్లోంచి వెళ్ళిపోతాట్ట. ఆ ఉద్యోగమెప్పుడొస్తుందో తెలియదు కానీ యింట్లో ఉన్నంతసేపూ నన్నాపనీ ఈ పనీ చెప్పి వేధించేస్తాడు బాబాయి.

బాబాయి మొహం కడుక్కుంటే నీళ్ళు నేనేయివ్వాలి గెడ్డం గీసుకుంటే నీళ్ళం దించాలి. స్నానానికి వెడితే తువ్వాలు తెచ్చివ్వాలి. ఇన్నిపనులూ నాచేత చేయించుకుని నన్ను మెచ్చుకుంటాడా అంటే అదీ లేదు. నేను చాలా గొప్పవాణ్ణి, నాకు సేవలు చేయడం నీ అదృష్టం - అంటాడు. చిన్నప్పుడు అంటే నాకు నాలుగేళ్ళప్పుడు ఆ మాటలన్నీ నిజమేనని నమ్మేసేవాణ్ని. ఇప్పుడూ నమ్మేసేవాణ్ని అత్తయ్య నాకు బాబాయి గురించిన నిజం చెప్పేసింది. నాచేత పని చేయించు కుందుకు బాబాయలాగంటూంటాడని.

అది నిజమే అయుండాలి. ఎందుకంటే అన్ని పనులూ బాబాయి నాచేత చేయించుకోడు, బాబాయి పెన్నులో సిరా పోయడం నాకెంతో యిష్టం. ఓసారి పోశానుకూడా. నేను బుడ్డిలోంచి పెన్నులోకే ఒంపాను కానీ ఎంత ఒంపినా సిరా నేలమీదేకానీ పెన్నులో పడదే! చివరికి సిరా అంతా అయిపోయింది. ఈలోగా బాబాయొచ్చి నాపెన్ను ముట్టుకున్నావంటే తంతానంతే అన్నాడు. నీకు సేవలు చేయడం నా అదృష్టం కదా అంటే - నీకు చేతనైన పనులే చేయాలి తెలిసిందా అన్నాడు బాబాయి. ఏ పనైనా నేర్చుకోకుండా ఎలా వస్తుంది ?

ఇంకా బాబాయి నన్ను చెయ్యనివ్వని పనులు చాలా ఉన్నాయి. తన బట్టలు రోజూ ఇస్త్రీ చాకలికిస్తాడు. ఇంట్లో కరెంట్ ఇస్త్రీపెట్టి ఉంది. నేను చేస్తానంటే వినడు. బాబాయి బూట్లు తనే పాలిష్ చేసుకుంటాడు. నన్ను చెయ్య నివ్వడు. ఆపైన బాబాయి గది ఎప్పుడూ చిందర వందరగా ఉంటుంది. అలా

ఉంటే నాకు నచ్చదు. పోనీ అని ఓసారి బాబాయి లేనప్పుడు తన గదంతా శుభ్రంగా సర్ది పెట్టాను. ఆర్నాత్రి బాబాయొచ్చి తనగది నేనే సర్దానని తిట్టిపోశాడు. చాలా వస్తువులు కనిపించడం లేదుట.

ఏం కనిపించడం లేదూ అనడిగాను. చెప్పాడు.

బాబాయి పెన్ను, షేవింగ్ క్రీము, రేజరు, టూత్ పేస్ట్; బ్రష్, నాలుకబద్ద- ఇవన్నీ జాగ్రత్తగా తెలివిగా బాబాయి రెండు బూట్లలోనూ సర్దేశాను. అక్కణ్ణించి తీసి యిచ్చాను. బాబాయి సంతోషించడానికి బదులు అంతెత్తున ఎగిరిపడి-ముఖం కడుక్కునే సామాను బూట్లోపల పెడతావా అని తిట్టి- ఇకమీదట నాగది సర్దావంటే వీపు చీరేస్తాను- అన్నాడు.

నేను చేసిన పనిలో తప్పేమిటో నాకర్థం కాలేదు. అత్తయ్య చెప్పినట్టు బాబాయి స్వార్థపరుడై ఉండాలనుకున్నాను. స్వార్థపరుడంటే తన కిష్టమైన పనులు మాత్రమే చేయించుకుని మనకిష్టమైన పనులు చేయనివ్వని వాడని చెప్పింది అత్తయ్య.

అప్పట్నుంచీ బాబాయేపని చెప్పినా చేయడం మానేశాను. ఈరోజుల్లో మంచిగా ఉంటే లాభం లేదు. నేను మొండిగా ఉండేసరికి బాబాయిలో మార్పు వచ్చింది. ప్రతి పనికీ మంచివాడినని పొగడ్డం మొదలు పెట్టాడు. అలా పొగుడుతూంటే నాకు చాలా బాగుంటోంది.

....నాని చాలా మంచివాడు. నేనడగ్గానే మంచినీళ్ళు తెచ్చిపెట్టేస్తాడు-.... అనేవాడు బాబాయి. నాకు వెంటనే వెళ్ళి నీళ్ళు తెచ్చి పెట్టాలనిపించేది. అలాగే చేసేవాణ్ణి. అప్పుడు బాబాయి నా వీపు తట్టి మెచ్చుకుని - "నా అంతటి వాడికి మంచినీళ్ళిచ్చావు. పెద్దయ్యాక నా అంతటివాడవౌతావులే- అనేస్తాడు.

అలాగంటే నాకు భయం. అందుకని వెంటనే-" నేను నీ అంతటివాణ్ణి కాను. నువ్వు అడ్డగాడిదలా తిరుగుతుంటావని నాన్న అస్తమానూ అమ్మకు చెబుతుంటాడు- "అని చెప్పేసాను ఒకసారి.

బాబాయి ఏడుపు ముఖం పెట్టి- "అలా నాదగ్గరెప్పుడూ అనలేదే-" అనేశాడప్పుడు. నాకు బాబాయిమీద జాలేసింది.

అమ్మా నాన్నా ఎప్పుడూ బాబాయి ఎదురుగా బాబాయిని పొగుడుతూనే ఉంటారు. బాబాయి లేనప్పుడు బాధ్యతలు తెలియని వాడని తిట్టుకుంటూంటారు.

బాధ్యతలు తెలియక పోవడమంటే- అస్తమానూ సినిమాలకు వెళ్ళడం, కొత్తబట్టలు కొనుక్కోవడం, ఊళ్ళు తిరగడం. ఈ అర్థం నేను బామ్మనడిగి తెలుసుకున్నాను.

బాబాయి విషయంలో నేను సందిగ్ధంలో పడిపోడానికి చాలా వరకూ అమ్మా, నాన్నా కారణం. వాళ్ళు బాబాయెదురుగా ఓ మాటంటారు. చాటుగా ఇంకోటంటారు. ఏది నిజమో- చిన్నపిల్లాణ్ణి నాకేం తెలుస్తుంది?

అనుమానం వచ్చి బామ్మనడిగాను. అప్పుడు బామ్మకు చాలా కోపం వచ్చింది- "పాపం మీనాన్న అమాయకుడు వాడికేం తెలియదు. ఇదంతా మీఅమ్మ పని- " అని అమ్మతో మాట్లాడానికి వెళ్ళింది. అప్పుడు యుద్ధం జరిగింది.

యుద్ధమంటే అమ్మా, బామ్మా మాట్లాడు కోవడం. ఈ విషయం నాకు బాబాయి చెప్పాడు.

తల్లికి కొడుకంటే ఎంతో ప్రేముంటుందిట. అందుకని బామ్మ నాన్నను దేనికీ అనుమానించదుట. నాన్న మరి బామ్మకు కొడుకు కదా!

ఇద్దరూ కాసేపు మాట్లాడు కున్నాక అమ్మ నన్ను పిలిచి -" అసలిదంతా ఈ వెధవ మూలంగా వచ్చింది- " అంటూ నన్ను కొట్టింది.

"బామ్మ తన కొడుకును అమాయకుడంది. నువ్వేమో నీ కొడుకును అనుమానించి కొడుతున్నావు- " నువ్వు మంచి అమ్మవు కాదు- " అన్నాను ఏడుస్తూ.

ఉన్నట్లుండి అంతా నవ్వేశారు. యుద్ధం ఆగిపోయింది. అయినా నాకోపం గానే ఉంది. అమ్మతో మాట్లాడ కూడదనుకున్నాను. అందుకే అత్తయ్య దగ్గరకు వెళ్ళాను.

అత్తయ్యంటే నాకు చాలా యిష్టం. నాకే ఏమిటి-ఇంట్లో అందరికీ ఇష్టమే అత్తయ్య చాలా అందంగా ఉంటుంది. ఎప్పుడూ నవ్వుతూంటుంది. నామీద అస్సలు కోప్పడదు.

నాకు బాగా చిన్నప్పటిదాకా అంటే మూడేళ్ళు నిండేదాకా అత్తయ్యసలు నన్ను వదిలేదికాదుట. తెగ ఆడించేదట. అప్పుడత్తయ్యకి పెళ్ళిసంబంధం కుదిరిందట. అప్పట్నుంచి అత్తయ్య వేరేలోకాల్లోకి వెళ్ళిపోయిందట. వేరేలోకాలంటే నాకు చాలా యిష్టం. నాకూ వెళ్లాలనే ఉంటుంది. అందుకని ఈమధ్య అత్తయ్యనే అడిగేశాను.

ఇప్పుడత్తయ్యకి పెళ్ళైపోయింది. అత్తయ్య పెళ్ళి జరిగి ఏడాది దాటిపోయింది. ఆ పెళ్ళి నేను చూసినట్లే గుర్తు. కాని చిన్ననాటి విశేషాలు నాకు బాగా గుర్తుండడంలేదు. అత్తయ్యమొగుడు ఇంకోదేశంలో ఉన్నాట్ట. ఇంకా ఇంకో ఆర్నెల్లదాకా అత్తయ్యను తీసుకునివెళ్ళట్ట.

అత్తయ్యను వేరేలోకాల గురించి అడిగితే- "నీకూ పెళ్ళైతే అప్పుడు తెలుస్తుంది వేరేలోకాల గురించి—" అంది.

"అయితే నేను తొందరగా పెళ్ళి చేసేసుకుంటాను—" అన్నాను.

"ఎందుకని?" అంది అత్తయ్య నవ్వుతూ.

"అప్పుడు నేనూ వేరేలోకాలు చూడొచ్చు. అక్కడెన్ని తమాషాలుంటాయో—" అన్నాను.

అత్తయ్య నవ్వుతూనే— "అయితే ఎవర్ని చేసుకుంటావేమిటి" అంది.

"నీ అంత అందంగా ఉన్న అమ్మాయిని పెళ్ళి చేసుకుంటాను-" అన్నాను.

అత్తయ్య విరగబడి నవ్వుతూ - "ఇంకా నయం- నన్నే చేసుకుంటానన్నావు కాదు-" అంది.

"నిన్నెలా చేసుకుంటాను? నీకు పెళ్ళైపోయిందిగా—" అన్నాను.

అప్పుడత్తయ్య యింకా యింకా నవ్వేసింది నాకు చాలా ఉడుకుమోత్తనం వచ్చింది.

"నువ్వు పెళ్ళిచేసుకుంటే నేను నవ్వానా? నా పెళ్ళంటే నవ్వుతావేం?" అన్నాను. ఇంకా ఏమో అనాలనుకున్నానుకానీ నాకేడుపు వస్తోంది. అందుకని మాట్లాడలేక పోయాను. అప్పుడత్తయ్య నన్ను దగ్గరగాతీసుకుని- "కోపం వచ్చిందా?" అంది ప్రేమగా.

వెంటనే నాకేడుపొచ్చేసింది. ఏడుపు తగ్గేక- "నువ్వెందుకు నవ్వాలి? నాకోపంరాదా?" అన్నాను.

"నీపెళ్ళి అనగానే నాకూ ఆనందం కలిగింది. సంతోషం ఎక్కువై పోయి నవ్వాపుకోలేకపోయాను. అయినా నేను నవ్వితే నువ్వూ నవ్వాలికాని అలా ఏడుస్తారేమిటి? నీకోసం మరి నేను నా అంత అందమైన అమ్మాయిని చూసిపెట్టద్దా—" అందత్తయ్య.

"ఊఁ" అన్నాను.

వెంటనే అత్తయ్య మళ్ళీ నవ్వేసింది. అత్తయ్యలానవ్వితే నాకు నచ్చలేదు: కానీ అత్తయ్యే చెప్పిందిగా తను నవ్వితే నేను నవ్వాలని.... అందుకే నేనూ నవ్వేశాను.

అప్పుడత్తయ్య నా బుగ్గమీద ముద్దుపెట్టుకుని -"అసలు నీకు పెళ్లామెందుకురా?" అంది.

వెంటనే నేను సందిగ్ధంలో పడిపోయాను-అత్తయ్యకు నిజం చెప్పాలా అబద్ధం చెప్పాలా అని.

పెళ్లామెందుకో నాకు నిజంగా తెలుసు. నేను మగాణ్ణి గదా! మగాణ్ణి ఇంట్లో గౌరవించేది పెళ్ళాం ఒక్కతే! నేను నాన్నను చూస్తున్నాగా-అమ్మేమో నాన్నని ఏమండీ అని గౌరవిస్తుంది—పెళ్లాం కాబట్టి! అత్తయ్య, బాబాయి, నాన్నని ఒరేయ్ అన్నయ్యా అంటారు. నాన్న స్నేహితులుకూడా నాన్నని ఏమోయ్ అంటారు. బామ్మయితే వెధవకానా అనికూడా అంటుంది. పోనీ వాళ్ళంతా పెద్దవాళ్ళని సరిపెట్టుకుందాం. ఆఖరికి నేనుకూడా నాన్నని నువ్వనే అంటాను. అసలు అత్తయ్యవాళ్ళలాగా ఒరేయ్ అనాలనికూడా సరదా ఉంది. కానీ అమ్మ కొడుతుంది.

అయితే ఒక్క గౌరవం కోసమే కాదు. పెళ్లాంవల్ల యింకా లాభాలున్నాయి. తిట్టినా సరే ఎదురు చెప్పదు. ఏపని చెప్పినా వెంటనే చేస్తుంది. ఇప్పుడు బాబాయి నాచేత చేయించు కుంటున్నట్లు నేనూ పెళ్ళాంచేత అన్ని పనులూ చేయించుకోవచ్చు. పెళ్లానికి వంట కూడా బాగా వస్తుంది. అమ్మయితే అస్తమానూ చేసేవి- అన్నం, వంకాయకూర, పప్పు, పులుసు, మజ్జిగ. నాకేమో చేగోడీలు, జంతికలు, ఉప్పుపిండి, మినపరొట్టె యిలాంటివన్నీ యిష్టం. అన్నం మానేసి యివే తినాలని నాకుంటుంది. పెళ్ళాముంటే యివన్నీ చేయించుకోవచ్చు.

కానీ యిలాగని అత్తయ్యకు చెప్పేస్తానేమిటి? వినగానే అత్తయ్య నవ్వేస్తుంది. అప్పుడు నాకేడుపువస్తుంది. అయినా నేను నవ్వాలి. లేకపోతే అత్తయ్య నేను మరీ చిన్న పిల్లాడి ననుకుంటుంది. అందుకని అబద్ధం చెప్పేశాను. నేను తెలివైన వాణ్ణిగా — అందుకని- "అమ్మకెప్పుడూ బామ్మ సేవలతోనే సరిపోతుంది. అమ్మకు్కూడా ఎవరైనా సేవలు చేయాలి కదా -" అనేశాను.

"అరిభడవా-" అని అత్తయ్య నన్నెత్తుకుని ముద్దులాడింది.

అందుకే నాకు ఎప్పటికీ చిన్న పిల్లాడిలాగానే ఉండి పోవాలనిపిస్తుంది.

పాపం అప్పుడప్పుడు బాబాయి కూడా నాఅంత తెలివిగానూ మాట్లాడుతూంటాడు. అంతా విని నవ్వేరు కుంటారు. తప్పితే ఎత్తుకుని ముద్దులాడరు. నాకు బాబాయిమీద అలాంటప్పుడు జాలేస్తుంటుంది.

అత్తయ్య ముద్దులాడుతోందని నేను సంబర పడుతున్నా నా ఈలోగా అత్తయ్య- "నీకు అమ్మమీద కోపం వచ్చి కదా నాదగ్గరకొచ్చావు? నీ పెళ్లాన్ని అమ్మకు సేవలు చేయనిస్తావా?" అన్నది.

అమ్మో - అత్తయ్యతో మాటల్లో పడి నాకోపం సంగతే మర్చిపోయాను. నేనిక అమ్మతో మాట్లాడను. కానీ అమ్మతో మాట్లాడ కుండా ఎలా?

అమ్మ తిట్టినాసరే నాకు అమ్మంటేనే యిష్టం. అమ్మ కొట్టినా సరే నాకు అమ్మంటేనే యిష్టం. ఎంత మంది నన్ను మెచ్చుకున్నా సరే అమ్మ మెచ్చుకున్నప్పుడే నాకు ఎక్కువ బాగుంటుంది. అందుకే ఒకోసారి అమ్మ నన్ను కొట్టేసి మళ్ళీ ప్రేమగా పిలిస్తే కోపం మర్చిపోక పోయినా మర్చిపోయినట్లు నటించి దగ్గరగా వెడతాను.

అమ్మ దగ్గరగా తీసుకుంటే ఎంత బాగుంటుందో - వెధవ కోపంకోసం ఆ సుఖం వదులు కుంటానా?

కానీ యిప్పుడు నిజంగానే నాకోపం మర్చిపోయాను. అందువల్ల ఎంచక్కా అమ్మ దగ్గరకు వెళ్ళిపోయేవాణ్ని. కానీ యిప్పుడు అత్తయ్య గుర్తు చేసేసింది. ఈ పెద్దాళ్ళెప్పుడూ యింతే - ఎదీ త్వరగా మర్చిపోనివ్వరు - అందునూ కోపమైతే మరీను....

అయితే అత్తయ్య చాలా మంచిది. ఇలాంటప్పుడే మంచివాళ్ళ నుపయోగించుకోవాలి. అందుకని "అత్తయ్యా! నా క్కోపం వచ్చిందనీ, అమ్మతో మాట్లాడనంటున్నాననీ అమ్మకు చెప్పవూ-" అన్నాను

"నేను చెప్పకుండా అమ్మ తెలుసుకోలేదా" అంది అత్తయ్య.

"తెలుసుకుంటుంది కానీ అందుకు చాలా సేపవుతుంది. అమ్మతో మాట్లాడకుండా నేను అంతసేపు వుండలేను. -" అన్నాను.

"అయితే వెళ్ళి మాట్లాడేయకూడదూ?" అంది అత్తయ్య.

"నేను వెళ్ళి మాట్లాడితే లోకువైపోతాను. అమ్మ వచ్చి నన్ను బతిమాలాలి. అప్పుడే మాట్లాడతాను." అన్నాను.

ఏమనుకుందో అత్తయ్య వెళ్ళి అమ్మను పిల్చుకుని వచ్చింది. అమ్మ వస్తూనే - "ఒరేయ్ నానీ - ఇందాకా నీకు చెప్పడం మర్చిపోయాను. రేపు చిన్నిగాడొస్తున్నాడ్రోయ్ -" అంది.

అమ్మతో మాట్లాడకూడదనుకున్నాను. కానీ చిన్నిగాడనగానే అన్నీ మర్చిపోయాను. చిన్నిగాణ్ణి నా చిన్నప్పుడెప్పుడో చూశాను. వాడు నాకంతగా గుర్తులేదు. చిన్నిగాడు నాకంటే రెండేళ్లు పెద్దట. దొడ్డ అంటే మా అమ్మకు అక్క కొడుకు వాడు.

"ఎందుకొస్తున్నాడమ్మా?" అన్నాను.

"ఎందుకేమిటి? నీతో ఆడుకుందుకు...." అంది అమ్మ.

చాలా సంతోషం కలిగింది. చిన్నపిల్లల్ని చిన్నపిల్లలు అర్థం చేసుకొన్నట్లు పెద్దాళ్ళర్థ చేసుకోలేరు. మా వీధిలో చిన్నపిల్లలున్నారు గానీ వాళ్ళెవరూ నా అంత తెలివైన వాళ్ళు కాదు. అయినా వాళ్ల నాతో కాసేపే ఆడుకుంటారు. చిన్నిగాడొస్తే మా యింటోనే ఉంటాడు కదా — రోజంతా వాడితోనే ఆడుకోవచ్చు.

"మంచి కబురు చెప్పానా? మరి నీ కోపం పోయిందా" అంది అమ్మ.

మళ్ళీ నాకు కోపం గుర్తుకొచ్చింది. కబురు చెబితే కోపం పోతుందా - బతిమాలాలి కానీ! అమ్మ నన్ను బతిమాలాలంటే ఏం చేయాలో నాకు తెలుసు.

బుంగమూతి అంటే ఎలా ఉంటుందో నాకూ తెలియదు. కోపం వచ్చినప్పుడూ, గారాం చేసేప్పుడూ మనుమలంతా బుంగమూతి పెడతారుట. అమ్మ బుంగమూతి పెడితే నాన్నకిష్టంట. ఇంకెవ్వరూ అమ్మ బుంగమూతిని మెచ్చుకోవడం వినలేదు నేను. నా బుంగమూతిని మాత్రం ఇండిల్లిపాదీ మెచ్చుకుంటారు. ఎలాగైనా చిన్నపిల్లలుగా ఉండటంలో చాలా సుఖాలున్నాయి.

"ఇంకెప్పుడూ తిట్టనేం?" అంది అమ్మ.

"ఇందాక నన్ను చూసి నవ్వావు-" అన్నాను మళ్ళీ.

"ఇంకెప్పుడూ నవ్వనేం?" అంది అమ్మ.

ఇంకా ఏదో అనాలనుకున్నాను కానీ యీలోగా అమ్మ తన రెండు చేతులూ ముందుకు చాపింది. అమ్మ అలా చేతులు సాచితే నేనుండగలనా? ఒక్క పరుగున అమ్మదగ్గరకు వెళ్ళిపోయాను. అమ్మ నన్ను దగ్గరగా హత్తుకుంది.

ఎంత సుఖంగా ఉందో! ఈసారి వెధవకోపం గుర్తుకొచ్చినా సరే మర్చిపోతాను....

## 2

ఇంటి ముందు రిక్షా ఆగింది. అందులోంచి దొడ్డ, చిన్నిగాడు ఇద్దరే దిగారు.

నేను దొడ్డిను చిన్నప్పుడెప్పుడో చూశాను. అట్టే గుర్తులేదు. ఇప్పుడు చూస్తే అమ్మకు లాగే ఉంది కానీ కొంచెం లావుగా ఉంది. చిన్ని గాడేమో నాకంటే పొడుగే - మరి నాకంటే కొంచెం పెద్దకదా....

నేను వాళ్ళను చూస్తూనే పరుగున అమ్మ గదిలోకి వెళ్ళిపోయాను. పలకా పలకపుల్లా తీసుకుని కూర్చున్నాను.

అప్పుడు నాకు చదువుకోవాలని లేదు. కానీ అమ్మ చెప్పింది — నాకు చదువంటే ఎంతో శ్రద్ధ అని దొడ్డ అనుకోవాలిట. నాకు అప్పుడే ఒత్తులు కూడా వచ్చేశాయని తెలిస్తే ఆశ్చర్యపోతుందిట. అందుకని వాళ్ళకోసం ఎదురు చూస్తూ పలక పట్టుకుని కూర్చున్నాను. కానీ ఎప్పటికీ రారేం?

వరండాలోంచి వాళ్ళ మాటలు వినబడుతున్నాయి. ఏమిటి అర్థంలేని ప్రశ్నలు వేసుకుంటున్నారు. అన్నీ నాకు వినిపిస్తున్నాయి. పలక పట్టుకుని పట్టుకుని నాకు విసుగొచ్చేసింది. లేచి నేనూ వరండాలోకి వెళ్ళిపోదామా అనుకుంటూండగా దొడ్డ — "నానీగాడేడే— కనిపించడేం ?" అంది.

"ఇప్పటి దాకా ఇక్కడే ఉండాలి - ఏ గదిలోకైనా వెళ్ళాడేమో - అంది అమ్మ.

వాళ్ళు నాకోసమే బయల్దేరుతున్నారని తెలుసు. ఇప్పుడిల్లంతా వెతుకుతూ కూర్చున్నారంటే చాలా సేప్పడుతుంది. నేనెక్కడున్నానో వాళ్ళకు తెలియాలి గదా - అందుకని గట్టిగా దగ్గేశాను.

నేను తెలివైన వాణ్ణిగా - నా ఉపాయం ఫలించింది.

దొడ్డ, అమ్మ నాగదిలోకి వచ్చారు. వాళ్ళ అడుగుల చప్పుడు వినగానే నేను తలను మరీ పలక మీదకు వంచేసి రాసుకోవడం మొదలు పెట్టాను.

"అబ్బా - నానిగాడికి చదువుమీద చాలా శ్రద్ధఎక్కువే ! మా చిన్నిగాణ్ణి పుస్తకం తియ్యమంటేనే తియ్యడు- " అంది దొడ్డ.

నాకు చాలా సంతోషం కలిగింది. ఈలోగా అమ్మ - " ఒరేయ్ నానీ ! కాసేపటి క్రితం దాకా దొడ్డ దొడ్డ అని కలవరించావు కదా- దొడ్డ వచ్చిందిరా- " అంది.

నిజానికి నేను దొడ్డ గురించి అడగలేదు. అస్తమానూ చిన్నిగాడి గురించే అడిగాను. పెద్దవాళ్ళు పెద్దవాళ్ళను సంతోష పెట్టడానికిలాంటి అబద్ధాలు చెబుతూండడం నా అనుభవంలో చాలా సార్లయింది.

అమ్మ మాటలు వెంటనే వినేస్తే నేను శ్రద్ధగా చదువుతున్నట్లు కాదు కదా ! అందుకని నేనింకా తలెత్తకుండా రాసేస్తున్నాను.

"ఒరేయ్ - నానీ !" అంది అమ్మ గట్టిగా.

ఉలిక్కిపడి తలెత్తాను.

"దొడ్డరా !" అంది అమ్మ.

నేను దొడ్డని చూశాను. పక్కనే చిన్నిగాడు కూడా కనిపించాడు. చటుక్కున లేచి నిలబడ్డాను. కానీ అప్పుడు ఎందుకో నాకు చాలా సిగ్గేసింది. తల వంచేసుకున్నాను.

"వెధవ - చాలా పొడుగయ్యాడే !" అంది దొడ్డ.

ఈ పెద్దవాళ్ళలో ఇదే నాకు నచ్చదు. చాలాకాలం తరువాత నన్ను చూసిందా - అయినా దొడ్డ నన్ను చూస్తూనే వెధవ అనేసింది. బొత్తిగా గౌరవం, మర్యాద తెలియవు.

"ఇలారారా-" అంది అమ్మ. నేను కదలలేదు.

అప్పుడు దొడ్డే నా దగ్గరకు వచ్చింది- "నీ దొడ్డనిరా - నాదగ్గర సిగ్గు పడతావేం ?" అంది. అప్పుడు నాకింకా సిగ్గెక్కువైపోయింది. దొడ్డ మాత్రం నన్నొదలలేదు. నన్నవీ యివీ అడిగి నా చదువు గురించి తెలుసుకుని పలకమీద నేను రాసింది చూసింది. పలకకు ఒకపక్క విష్వక్సేనుడు అని వ్రాశాను. రెండో ప్రక్క సందిగ్ధము అని రాశాను. అవి చాలా కష్టమైన పేర్లుగా - అందుకని దొడ్డ- "అరే- నీకు వత్తులూ అవీ వచ్చేశాయే ! మానాని చాలా తెలివైనవాడు, దస్తూరీ కూడా ముత్యాలకోవాలా ఎంత బాగుందో-" అని మెచ్చుకుని— "మా చిన్నిగాడూ ఉన్నాడు- వెధవ ! వాడేం రాశాడో వాడికే అర్థమైచావదు-" అంది.

మా పక్కింట్లో రాజిగాడు నాకంటే పెద్దనీ వాడికింకా యారమాలు కూడా రావడంలేదనీ చెప్పాలనిపించింది. కానీ నేను సిగ్గుపడుతున్నానుకదా- ఎక్కువ మాట్లాడలేకపోయాను.

అప్పుడు దొడ్డ నాకు చిన్నిగాడిని పరిచయం చేసి-"మీరిద్దరూ ఆడుకోండి" అని చెప్పి వెళ్ళిపోయింది. పెద్దాళ్ళంతా వెళ్ళిపోయాక ఆగదిలో నేనూ, చిన్నిగాడూ మిగిలాం.

నేను చిన్నిగాడి వంక చూశాను. వాడు నావంక అదోలా చూస్తున్నాడు మాట్లాడతాడేమోనని కాసేపు చూశాను. మాట్లాడంలేదు వాడు. ఆఖరికి నేనే "హమ్మయ్య - పెద్దాళ్ళు వెళ్ళిపోయారు. మనమింక ఆడుకోవచ్చు-" అన్నాను.

చిన్నిగాడు వెంటనే- "నీతో నాకాటలేమిటి? నేను నీకంటే చాలా పెద్దాణ్ణి!" అన్నాడు.

మొదలెడుతూనే ఇలా మాట్లాడతాడేమిటి అనుకున్నాను- "నువ్వు నాకంటే ఎంత పెద్దేమిటి ? రెండేళ్ళేగా !" అన్నాను.

"రెండేళ్ళంటే ఎంతో నీకు తెలుసా ? ఏడాదికి పన్నెండు నెలలు. నెలకు నాలుగు వారాలు. వారానికి ఏడు రోజులు. రోజుకిరవైనాలుగ్గంటలు. గంటకరవై నిమిషాలు. నిముషానికి అరవై సెకన్లు - అంటే బోలెడు లక్షల.సెకన్లు. ఆ వచ్చిన సెకన్లని రెండుపెట్టి గుణించాలి. అంటే నీకూ నాకూ కొన్ని లక్షలసెకన్లు తేడా అన్నమాట-" అన్నాడు వాడు.

వాడు చెప్పింది నాకు అర్థంకాలేదు. కానీ వాడికి నాకు తెలియనివేవో చాలా తెలుసునని గ్రహించాను. ఆ విషయం ఒప్పేసుకుంటే వాడింకా గొప్పచేసేస్తాడని భయపడి- "కొన్నాళ్ళుపోయాక నేనూ పెద్దవుతాగదా- అప్పుడు నేను నీకంటే పెద్దవాణ్ణయిపోయి యింతకంటే కష్టమైన విషయాలు చెబుతాను"- అన్నాను.

చిన్నిగాడు నవ్వేసి- "నువ్వు నిజంగా బాగా చిన్నవాడివి. నీకు బొత్తిగా ఏమీ తెలియదు. నువ్వు పెద్దవాడివైతే నేనింకా పెద్దవాడినౌతానుగానీ యిలాగే ఉండిపోతాననుకుంటున్నావా ?" అన్నాడు.

అరెరే అనుకున్నాను. నిజమే- ఇది నాకెందుకు తట్టలేదు ?

చిన్నిగాడిని నేను మాటల్లో నెగ్గలేను. కానీ నా గురించి వాడికి సరిగ్గా తెలియదేమో అనిపించి- "నాకు అక్షరాలు,గుణింతాలు, ఒత్తులు అన్నీ వచ్చేశాయి తెలుసా ? నాకంటే పెద్దవాళ్ళకూ్కడా అవి రాలేదు-"అని చెప్పాను. చిన్నిగాడు వివరాలడిగితే అప్పుడు రాజిగాడి గురించి చెప్పాలనుకున్నాను. కానీ వాడలాంటివేమీ అడక్కుండా- "పెద్దవాళ్ళంటే స్నేహితులకి ఉత్తరాలు రాసుకోవాలి. నువుత్తరం వ్రాయగలవా ?" అన్నాడు.

నేనెప్పుడూ ఎవరికీ ఉత్తరాలు రాయలేదు. కానీ అమ్మ, నాన్న ఉత్తరాలు రాయడం చూశాను. అందుకని "ఆఁ వచ్చు-" అన్నాను. పరువు నిలబెట్టుకుందుకు అప్పుడప్పుడిలాంటి చిన్న అబద్ధాలు చెప్పడం తప్పుకాదు. అమ్మ, నాన్న, బాబాయి, అత్తయ్య, ఆఖరికి అందరికంటే పెద్దదయిన బామ్మకూడా యిలాంటి అబద్ధాలు చాలా చెప్పగా నేను విన్నాను.

కానీ చిన్నిగాడు నన్నంత సులభంగా వదలిపెట్టలేదు. వాడు నన్నో తెల్ల కాగితమూ పెన్సిలూ తెమ్మన్నాడు. రెండూ బాబాయి గదిలోంచి బాబాయికి తెలియకుండా తెచ్చిచ్చాను. చిన్నిగాడు కాగితాన్ని మధ్యకు మడతపెట్టి రెండు ముక్కలు చేసి ఒకటి నాకిచ్చి- "దీనిమీద పెన్సిలుతో ఉత్తరం రాయి. నాకేరాయి. పూజ్యనీయుడైన మహారాజశ్రీ అన్నయ్య సత్యనారాయణకు నాని నమస్కరించి వ్రాయునది- అని మొదలు పెట్టాలి. తెలిసిందా ?" అన్నాడు.

"సత్యనారాయణ ఎవరు ?" అన్నాను.

"నేనే- చిన్ని నా ముద్దుపేరు. నా అసలుపేరు సత్యనారాయణ. పెద్దాళ్ళకుత్తరాలు రాసేటప్పుడు ముద్దుపేరు కాకుండా అసలు పేరు రాయాలి. చిన్నవాళ్లు తమ ముద్దుపేర్లే రాయాలి-" అన్నాడు చిన్ని.

చిన్ని అసలు పేరు చెప్పగానే నాకూ నా అసలుపేరు చెప్పాలనిపించి వాడినడిగాను. వాడు వెంటనే- వద్దు- నీ అసలుపేరు నీకంటే చిన్నవాళ్ళకే చెప్పు. అప్పుడు వాళ్ళు నీ కుత్తరం రాస్తారు-" అన్నాడు.

ఉత్తరం మొదలుపెట్టాను. కానీ చిన్నిగాడేం చెప్పాడో గుర్తులేక వాణ్ణి మళ్ళీ అడిగాను. ఏకళనున్నాడో గొప్ప చేయకుండానే మళ్ళీ చెప్పాడు.

"పూజ్యనీయు...." అని రాసేసరికి కాగితానికి ఒకవైపు అయిపోయింది. దైనమహరా అవి రాసేసరికి రెండోవైపూ అయిపోయింది. చిన్నిగాడు ఆ ఉత్తరం చూసి ఒకటే నవ్వు. నాకుడుకుమోత్రసం వచ్చి- "ఎందుకు నవ్వుతావూ ?" అనడిగాడు.

"నువ్వు బాగా చిన్నపిల్లాడివి-" అనేశాడు వాడు.

ఎందుకో కూడా వాడే చెప్పాడు. నేను రాసిన కాగితంమీద పెద్దాళ్ళయితే బోలెడు అక్షరాలు రాస్తారుట. వాళ్ళక్షరాలు చిన్నవిగా ఉంటాయిగా....అందుకని! అసలు పెద్దాళ్ళంటే చిన్నక్షరాలు రాసేవాళ్ళని అర్థంట. చిన్నాళ్ళంటే పెద్దక్షరాలు రాస్తారుట.

"ఏదీ నువ్వు రాయి చూద్దాం !" అన్నాను.

చిన్నిగాడు వెంటనే చకచకా కాగితం రెండుప్రక్కలా ఏమేమిటో రాసేశాడు నేనా కాగితం చూశాను. ఏమీ అర్థంకాలేదు.

ఇవి అక్షరాలు కావు. పిచ్చిగీతలు-" అన్నాను.

"పెద్దాళ్ళ అక్షరాలలాగే ఉంటాయి. కావాలంటే నువ్వు మీనాన్న ఉత్తరం చదువు- చూద్దాం-" అన్నాడు చిన్ని.

అప్పుడు నాకు గుర్తొచ్చింది. ఈమధ్యనే నాన్న ఊరికివెళ్ళినప్పుడమ్మకు ఉత్తరం రాశాడు.ఏం రాశాడని అడిగితే ఏంలేదులే అని ఊరుకుందమ్మ. అప్పుడమ్మ చూడకుండా రహస్యంగా ఆ ఉత్తరం చదవాలనుకున్నాను కానీ యిప్పుడు చిన్నిగాడి ఉత్తరంలాగే అప్పుడదీ అర్థంకాలేదు.

అంచేత చిన్నిగాడు నిజమే చెప్పాడని నాకనిపించింది. అప్పుడే వాడికి పెద్దాళ్ళలా రాయడం వచ్చేసిందంటే నేను వాడితో మాట్లాడి నెగ్గలేను. వాడు చెప్పినట్లు వినడమే మంచిది. అప్పుడు నాకింకో అనుమానం కలిగింది.

"మరి నా అక్షరాలిప్పుడేకదా చూశావు- నేను బాగా చిన్న వాణ్ణని నన్ను చూడగానే ఎలా తెలిసింది ?" అన్నాను ఆశ్చర్యంగా.

అప్పుడు చిన్నిగాడు నాకు మరో కొత్త విషయం చెప్పాడు.

పెద్దాళ్ళెవరింటికి వెళ్ళినా తమ పిల్లల్ని తిట్టి అక్కడి పిల్లల్ని మెచ్చుకుంటారట. కానీ నిజానికి వాళ్ళకి వాళ్ళ పిల్లలంటేనే యిష్టం. అది పెద్దాళ్ళకు తెలుస్తుంది. చిన్నపిల్లలకు తెలియదు.

"ఇందాకా మాఅమ్మ నన్ను తిట్టి నిన్ను పొగిడిందా? నిజానికి మా అమ్మకు నేనంటేనే ఎక్కువిష్టం. అది తెలియక నువ్వు మా అమ్మ పొగడ్తలకు సంబరపడిపోయావు. ఆ సంబరం చూడగానే నువ్వు బాగా చిన్నవాడివని నాకు తెలిసిపోయింది...." అన్నాడు చిన్నిగాడు గర్వంగా.

ఇదీ నిజమే ! అమ్మకు నేనంటేనే యిష్టం. ఎదుటి వాళ్ళతో మాట్లాడేటప్పుడు అమ్మ నాగురించి చాలా అబద్ధాలు చెబుతుంది.

ఇంట్లో నేను అస్తమానూ ఏదైనా పెట్టమని అడుగుతుంటాను. ఎప్పుడూ నీకు తిండిగోడవే పోయి ఆడుకోరాదూ అని విసుక్కుంటుందమ్మ. కానీ పక్కింటికి వెళ్ళినపుడు —"వెధవకి ఎప్పుడూ ఆటలే-బొత్తిగా ఏమీతినడు. మీవాడేది పెడితే అది బుద్ధిగా తింటాడు—" అని రాజిగాణ్ణి మెచ్చుకుంటుంది. అలాగని రాజిగాడంటే అమ్మకిష్టమూలేదు. వాడు మా యింటికొస్తే నా ఆటబొమ్మలన్నీ దాచేస్తుంది—వాడు పాడుచేస్తాడని ?

చిన్నిగాడికి చాలా తెలుసు. మరి యివి నాకూ తెలుసు. నేనూ పెద్దవాణ్ణే కావాలి. కానీ వాడొప్పుకోడు. అందుకేదైనా ట్రిక్ చేయాలి. నేను తెలివైన వాణ్ణిగా అందుకని వెంటనే అక్కడ్నించి బాబాయి గదిలోకి వెళ్ళి ఇంకో కాగితం తీసుకుని దానిమీద పెన్సిలుతో చిన్నచిన్న గీతలు, చుక్కలూ, సున్నాలు రాసేశాను. ఆ కాగితం చిన్నిగాడి దగ్గరకు తీసుకెళ్ళి—"చూడు ! నేనూ ఉత్తరం రాశాను-" అన్నాను.

చిన్నిగాడది చూసి "ఇదేం ఉత్తరం? ఇందులో అక్షరాలు లేవు. అన్నీ గీతలూ, చుక్కలూనూ-" అన్నాడు.

"నేనూ పెద్దవాణ్ణి గదా-నా ఉత్తరం అలాగే ఉంటుంది-" అన్నాను గొప్పగా.

వెంటనే చిన్నిగాడు ఆలోచనలోపడిపోయాడు. కాసేపాగి- "నీకు మాంత్రికుడూ రాజకుమారీ కథ తెలుసా ?" అన్నాడు.

"తెలియదు. నాకు రామాయణం ఒక్కటే తెలుసు. బామ్మ నాకు రోజూ చెబుతుంది-" అన్నాను.


అప్పుడు చిన్నిగాడు ఉత్సాహంగా- "అబ్బే-అయితే నువ్వు బాగా చిన్నవాడివి. పెద్దాళ్ళు రోజూ ఒక్కటే కథ వినరు. మా బామ్మయితే నాకు రోజుకో కథ చెబుతుంది. చెప్పిన కథ మళ్ళీ చెప్పదు-" అన్నాడు.


"ఏమో-నాకు రాముడికథ రోజూ వినాలనిపిస్తుంది-" అన్నాను.

"చిన్నవాడివిగా-నీకు అలాగే అనిపిస్తుందిలే! రాముడికథ బాగానే ఉంటుంది. కానీ అంతకంటే మంచికథలింకా బోలెడున్నాయి. నువ్వు వింటానంటే నీకు మాంత్రికుడూ-రాజకుమారీ కథ చెబుతాను. అదెంత బాగుంటుందో ! చెప్పడం నాకు చాలా యిష్టం-" అన్నాడు చిన్నిగాడు.

నాకూ ఆ కథ తెలుసుకోవాలనిపించింది. నేనడగ్గానే చిన్నిగాడు చెప్పడం ప్రారంభించాడు. వాడు చెప్పినంతా మళ్ళీ చెప్పలేను కానీ క్లుప్తంగా యిదీ కథ....


అనగా అనగా ఒక మాంత్రికుడు. వాడు దేవికి వందమంది రాజకుమారుల్ని బలిస్తే ప్రపంచానికి రాముడిలాంటి చక్రవర్తి అయిపోతాట్ట. రాజకుమారుల్ని వెతికి పట్టుకొవడం కష్టం కదా! అందుకని వాడు చాలా అందమైన రాజకుమారిని ఎత్తు



కుని పోయాడు. ఆ రాజకుమారికోసం ఎక్కడెక్కడి రాజకుమారులు వెతుక్కుంటూ మాంత్రికుడి దగ్గరకే వస్తున్నారు. మాంత్రికుడు వాళ్ళను పట్టుకుని దేవికి బలిచ్చేస్తున్నాడు. పాపం-రాజకుమార్తెకు మాంత్రికుడు దుర్మార్గుడని తెలియదు. వాడు చాలా మంచివాడనుకుంటోంది. వాడుకూడా రాజకుమారికి అసలు వేషంలో కాక రాజకుమారుడి రూపంలో కనపడేవాడు. రాజకుమారి మాంత్రికుణ్ని ప్రేమించి వాడేంచెప్పినా వినేది. వందమంది రాజకుమారులను బలిచ్చి కానీ మాంత్రికుడు పెళ్ళి చేసుకోకూడదు. వాడు రహస్యంగా రాజకుమారికి తెలియకుండా తొంభైతొమ్మిది మంది రాజకుమారులను బలిచ్చేశాడు.

"తొంభైతొమ్మిదంటే తెలుసా ? వందకు ఒక్కటి తక్కువ. అంటే ఇంకొక్క రాజకుమారుణ్ని బలిస్తే మాంత్రికుడు ప్రపంచానికి చక్రవర్తి అయిపోతాడు. వాడు దుర్మార్గుడు కదా-అందర్ని కష్టాలు పెడతాడు—" అన్నాడు




చిన్నిగాడు. వాడలా చెప్పేదాకా నాకు తొంభైతొమ్మిదన్నా తెలియలేదు, మాంత్రికుడు చక్రవర్తి కావడంవల్ల ప్రమాదమూ తెలియలేదు.

"మరి-రాజకుమారినికూడా కష్ట పెడతాడా ?" అన్నాను ఆత్రుతగా.

"మామూలు మగాళ్ళే పెళ్లాలను బోలెడు కష్టాలు పెడతారు. మరి మాంత్రికుడూరుకుంటాడా ? మాంత్రికుణ్ని పెళ్ళి చేసుకుంటే రాజకుమారి చాలా చాలా కష్టాలు పడుతుంది-" అన్నాడు చిన్నిగాడు.

"మరప్పుడేమయింది ?"

చెబుతాను విను. రాజకుమార్తెలెప్పుడూ మాంత్రికుల్ని పెళ్ళి చేసుకోకూడదు. మన రాజకుమారికి తన్నెత్తుకుని వచ్చినవాడు మాంత్రికుడని తెలియదు. అందుకని పాపం పెళ్ళికూ్కడా ఒప్పేసుకుంది. అప్పుడేమో వందో రాజకుమారుడు అంటే ఆఖరివాడు వచ్చేశాడు-" అన్నాడు చిన్నిగాడు.

ఆ రాజకుమారుడుకూడా చచ్చిపోతాడని, మాంత్రికుడు రాజకుమారిని పెళ్ళి చేసేసుకుని కష్టాలు పెట్టేస్తాడని కంగారుపడిపోయాను కానీ అలా జరగలేదు. ఆఖరి రాజకుమారుడు రహస్యంగా రాజకుమారిని కలుసుకుని మాంత్రికుడి గురించిన అసలు నిజం చెప్పాడు. అప్పుడు రాజకుమారి సాయంతో మాంత్రికుడి ప్రాణాలెక్కడుందీ తెలుసుకుని తెలివిగా మాంత్రికుణ్ని చంపేసి తనే ప్రపంచానికి చక్రవర్తి అయి రాజకుమారిని పెళ్ళిచేసుకుని ఎన్నో ఏళ్ళు ప్రపంచాన్ని పరిపాలించాడు.

కథ భాగానేఉంది కానీ నాకంత బాగా అర్థంకాలేదు. రాముడికథైతే నాకు బాగా అర్థమయ్యేది. కథ అర్థంకాలేదంటే చిన్నిగాడు నన్ను చిన్నవాడంటాడని భయమేసింది. అందుకని- "కథ భలే బాగుంది, భలే బాగుంది, మరి నేనూ పెద్దవాణ్ణేగా"—అన్నాను.

చిన్నిగాడు వెంటనే-"ఈ కథ నేను నీకెందుకు చెప్పానో తెలుసా ?" అన్నాడు. తెలియదన్నాను నేను.

ఒక మాంత్రికుడిలాగే రాజకుమారిని ఎత్తుకునిపోతే చిన్నిగాడు రక్షించాడుట. వాడిని రాజకుమారి ప్రేమించిందట.

"అయితే నువ్వు పెళ్ళిచేసేసుకున్నావా ?"

"ఇంకా చేసుకోలేదు. మేమింకా ప్రేమించుకుంటూనే ఉన్నాం. ఈలోగా పనిమీద నేనిక్కడకు వచ్చేశాను. అయినా అవన్నీ పెద్దాళ్ళకబుర్లు—నీకెందుకు" అన్నాడువాడు.

"నేనూ పెద్దాడినేగా-" అన్నాను దిగులుగా. వాడొప్పుకోడేమోనని నా భయం.

నువ్వేం పెద్దాడివి. నిన్నే రాజకుమార్తైనా ప్రేమించిందా?" అన్నాడు వాడు.

నాకు క్రోషం వచ్చింది. అయినా తెలివైనవాణ్ని కదా, అందుకని" ఇక్కడ రాజకుమారి లేదుగా- ఉంటే తప్పకుండా నన్ను ప్రేమిస్తుంది-" అన్నాను.

"అయితే నీకు నేను రాజకుమారిని చూపిస్తాను. అది నిన్ను ప్రేమిస్తుందేమో చూద్దాం-" అన్నాడు చిన్నిగాడు.

అప్పుడు నాకు లోపల్లోపల భయమేసింది. నిజంగా రాజకుమారి ఉంటే నన్ను ప్రేమిస్తుందా? మాంత్రికుడ్ని నేను భయపెట్టగలనా? ఇలాంటి అనుమానాలు నాకు చాలా వచ్చినా బయటకు చెప్పలేదు.

అప్పుడో తమాషా జరిగి నాలో ధైర్యం పెరిగిపోయింది.

గోడమీంచి బల్లి ఒకటి పట్టుతప్పి చిన్నిగాడిమీద పడింది. వాడు హడిలిపోయి కెవ్వుమని అరిచాడు. ఆకేక విని అమ్మ, దొడ్డ అక్కడకు పరుగెత్తుకుని వచ్చారు.

"ఏం జరిగిందిరా? నువ్వు వాణ్నేమైనా చేశావా?" అనడిగిందమ్మ.

నేను వెంటనే - "అబ్బే - నేనేం చేయలేదు. గోడమీంచి బల్లి వాడిమీద పడింది -" అన్నాను. చిన్నిగాడింకా వణికి పోతూనే ఉన్నాడు.

అప్పుడు దొడ్డ నవ్వేసి - "వెధవకి కప్పలన్నా, బల్లులన్నా చచ్చేటంత భయం -" అనేసి అమ్మను తీసుకుని వెళ్ళిపోయింది.

అప్పుడు నేను గొప్పగా చిన్నిగాడి వంక చూసి - 'నాకు బల్లి, కప్ప అంటే భయంలేదు. అంచేత మాంత్రికుణ్ణి నీకంటే గొప్పగా ఓడించగలను - "అన్నాను.

చిన్నిగాడు వెంటనే ఏం మాట్లాడలేదు. కాసేపాగి - "అవన్నీ తర్వాత చూద్దాం. ముందు నీకో రాజకుమారిని చూపించనీ -" అన్నాడు.

## 3

సాయంత్రమే చిన్నిగాడు నాదగ్గరకొచ్చి - "రాజకుమారి మీ ఎదురింట్లోనే ఉందిరోయ్. వెళ్ళి నిన్ను ప్రేమిస్తుందేమో అడుగు అది ఒప్పుకుంటే నువ్వు పెద్దాడికిందే లెక్క. అప్పుడు నేను నీతో ఆడతాను -" అన్నాడు.

ఎదురింట్లో రాజకుమారి అనగానే ఎవరో నాకు తెలిసిపోయింది. ఆ అమ్మాయి అత్తయ్య కంటే కాస్త చిన్నట. కానీ అత్తయ్య కంటే చాలా అందంగా ఉంటుంది. నవ్వినప్పుడు ఇంకా అందంగా ఉంటుంది. ఆ అమ్మాయిపేరు హేమలత. అందరూ లతా అని పిలుస్తారు. నేనూ లత్తా అనే అంటాను. ఆ అమ్మాయి గురించి నాకంటే ఎక్కువగా బాబాయికి తెలుసు.

లత గురించి బాబాయి నాకు చాలా చెప్పాడు. కొన్ని అర్థమయ్యాయి. కొన్ని అర్థం కాలేదు. అయితే బాబాయి కంటే నేనే ఎక్కువగా లతతో మాట్లాడాను. అయినా బాబాయికే నాకంటే ఎక్కువగా లతగురించి తెలుసు. పెద్దాళ్ళెలాగైనా చాలా గొప్పవాళ్ళు. బాబాయి అస్తమానూ తన పేరు చెప్పి లత దగ్గర పొగడమంటూండేవాడు. నాకది యిష్టముండేది కాదు. కానీ బాబాయి డబ్బులిస్తాననేవాడ. ఉత్తినే వస్తూంటే వదులుకోవడమెందుకు? నేను లత దగ్గర బాబాయిని పొగిడేవాణ్ణి.

మాయింటికి లత ఎక్కువగానే వచ్చేది. బాబాయి లేనప్పుడు చూసుకుని వచ్చేది. నామాటలు విని లత నవ్వేది.

"మీ బాబాయి చాలా గొప్పవాడే! కానీ ఈ విషయం నాకెందుకు చెబుతావు?" అని లత నన్నోసార అడిగింది.

"మరి బాబాయి నాకు డబ్బులిచ్చాడుగా -" అన్నాను.

లత ఆశ్చర్యపడి - "ఎందుకు? అంది.

"ఎందుకో నాకూ తెలియదు- " అన్నాను.

లత అందంగా నవ్వేసి - "తన్ను పొగడ్డానికి మీ బాబాయి డబ్బులిస్తాడు. ఈ విషయం నాకు చెప్పినట్లు బాబాయికి చెప్పకు -" అంది.

"చెబితే నీకేం?" అన్నాను.

లత నన్నెత్తుకుని బుగ్గలమీద ముద్దు పెట్టుకుని- "చెబితే ఇంకెప్పుడూ నీకు డబ్బివ్వడు -" అంది.

లత నన్ను చాలాసార్లు ముద్దు పెట్టుకుంది. లత ముద్దు నాకెంతో బాగుంటుంది. ఎందుకంటే నన్ను అమ్మ, నాన్న, బాబాయి, అత్తయ్య, బామ్మ - అంతా ముద్దు పెట్టుకోవటం గొప్పకాదు. అప్పుడప్పుడు నాన్న స్నేహితులు, బాబాయి స్నేహితులు, మా యిరుగు పొరుగువాళ్ళు కూడా నన్ను ముద్దు పెట్టుకుంటూంటారు. అయితే వాళ్ళు మావాళ్ళు చూస్తున్నప్పుడే ముద్దు పెట్టుకుంటారు. ఎందుకంటే వాళ్ళు నామీద యిష్టంతో నన్ను ముద్దు పెట్టుకోరు. నావాళ్ళని సంతోషపెట్టడం కోసం నన్ను చేరదీస్తారు.

ఈ విషయం నాకూ బాబాయే చెప్పి "ఎవరైతే నిన్ను ఎవరూ చూడనప్పుడు కూడా ముద్దుపెట్టుకుంటారో వాళ్ళకు నిజంగా నువ్వంటే యిష్టమన్నమాట" అన్నాడు. అప్పట్నించీ నేను అందరినీ శ్రద్ధగా గమనించడం మొదలుపెట్టాను.

మా వీధిలోనే బాపయ్యగారని ఉన్నారు. ఆయన్ని బాపయ్య తాతయ్యగారని అంతా పిలుస్తారు. నేనైతే తాతయ్యగారనే అంటాను. ఆయన రోజూ సాయంత్రం మా యింటికి వచ్చి కూర్చుని పేపర్లూ పుస్తకాలూ చదివి వెడుతూంటారు. ఆయన నన్ను రోజూ ముద్దులాడేవాడు. ఆయనకు పిల్లలంటే చాలా యిష్టమని మా ఇంట్లో చెప్పుకుంటారు. బాబాయి చెప్పేదాకా నేనూ నిజమేనని అనుకున్నా.

ఒకరోజున ఆయనొక్కడూ వీధి గదిలో కూర్చుని పేపరు చదువుతూంటే నేను వెనక నుంచి వెళ్ళి ఆయన జుట్టుపట్టుకుని లాగాను. ఆయనకెంతో జుట్టులేదు. ఒకసారి బాబాయి నాచేతులవంక చూసి-" ఒరేయ్-నానీ! నీవి చిట్టిచిట్టి చేతులు ఈ చేతుల్తో అయితే బాపయ్య తాత జుట్టు కూడా పట్టుకుని లాగొచ్చు -" అన్నాడు. అదెంతవరకూ నిజమో చూడాలని ఒకరోజున ఆపని చేస్తే ఆయన నాకేసి చాలా కోపంగా చూశాడు. ఇంతలో ఆ గదిలోకి నాన్న వచ్చాడు. అప్పుడా తాతయ్య చేతిలోని పేపరు పక్కన పడేసి నన్నమాంతం ఎత్తేసుకొని "మీ వాడు చాలా చిలిపి. నా జుట్టు పట్టుకొని లాగుతున్నాడు." అంటూ నన్ను ముద్దులాడేశాడు. అదంతా నాటకమని నాకు నిజం తెలిసిపోయిందిగా ఇంక ఆ ముద్దులు నాకు బాగోలేవు.

అలాగే నాన్నగారి స్నేహితుడింకొకడున్నాడు. ఆయన ఎప్పుడూ మా యింటికి అప్పుకోసమే వస్తాడు. ఇంట్లో అందరూ ఆయన్ను అప్పారావంటూంటే నేనదే ఆయన పేరనుకుని ఓ రోజున ఆయన మా యింటికి రాగానే "నాన్నా - అప్పారావుగారొచ్చారు" అని కేక పెట్టాను. అప్పుడు నాన్న కంగారుగా పరుగెత్తుకొచ్చి "అప్పారావుగారంటే ఈయన కాదురా- ఈయన పేరు రమణమూర్తి -" అని చెప్పాడు. రమణమూర్తయితే యింట్లో అప్పారావని చెప్పుకుంటారేమని నేను చాలా ఆశ్చర్యపడ్డాను. కానీ నాన్న నన్నింక మాట్లాడ నివ్వకుండా నోరు నొక్కేసి లోపలకు తీసుకుని పోయాడు. ఆ తర్వాత కూడా యింట్లో రమణమూర్తిని అప్పారావనే అంటున్నారు. నేనుమాత్రం ఆయన వచ్చినప్పుడు -

రమణమూర్తిగారొచ్చారనే అంటున్నాను. అయితే నాకూ ఆయన్ని అప్పారావని పిలవాలని సరదాగా ఉంది. కానీ యింట్లో ఒప్పుకోవడం లేదు. పెద్దవాళ్ళంటే అంతే! తమ సరదాలు తమవేగానీ పిల్లల సరదాల గురించి పట్టించుకోరు.

ఇంతకీ ఆ అప్పారావుగారు మా యింటికొచ్చినప్పుడు నేను కనపడగానే - యింట్లో మీ నాన్నఉన్నాడా - అనడుగుతాడు. నాన్న లేడంటే నా ముఖంకేసి మళ్ళీ చూడకుండా వెనక్కువెళ్ళిపోతాడు. నాన్న ఉన్నాడంటే పిల్చుకురమ్మంటాడు. నాన్నొచ్చేదాకా ఆగి అప్పుడే నాన్న చూస్తూండగా నన్ను ముద్దులాడుతాడు.

పాపం లత అలా కాదు. ఎవ్వరూ చూడకపోయినా సరే - గదిలో మేమిద్దరమే ఉన్నా సరే - నన్ను ముద్దు పెట్టు కుంటుంది. అంటే లతకు నిజంగానే నేనంటే యిష్టమన్న మాట.

లతకు ఆ విషయం చెప్పి మెచ్చుకుంటే" నువ్వంటే నిజంగా నాకిష్టమని నీకెలా తెలుసు?" అంది.

అప్పుడు నేను లతకు బాబాయి చెప్పిందంతా చెప్పాను. అది విని లత ఒకటే నవ్వు. లత నవ్వుతోంది కదా అని నేను ఇంకా చెప్పేను. ఎవరైనా నా మాటలు విని నవ్వుతూంటే నాకింకా ఏమేమో చెప్పాలనిపించేస్తుంది.

"నాన్న చూస్తుండగా బాపయ్య నెత్తిమీద మొట్టికాయలు మొడతాను అయినా ఆయన నన్ను ముద్దులాడుతాడు-" అన్నాను.

లత యింకా నవ్వింది.

"బాపయ్య తాతయ్యకు పంచి ఊడపీకేస్తాను." అన్నాను.

లత మందలిస్తున్నట్లు" తప్పమ్మా - అలా అనకూడదు." అంది.

"ఏం?" అన్నాను.

"నువ్వు మంచివాడివికదా - అందుకే నాకిష్టం. నువ్వు చెడ్డపనులు చేస్తే నా కిష్ట ముండదు," అంది లత.

"అయితే ఈ రోజు నుంచీ ఒక్క చెడ్డపని కూడా చెయ్యను" అన్నాను వెంటనే.

"మరి మీ బాబాయిని పొగడ్డం కూడా చెడ్డపనే !" అంది లత.

అంతే - ఆ తర్వాత ఒక్కసారికూడా లతదగ్గర బాబాయిని పొగడలేదు. లత నన్నెంతో మెచ్చుకుని - మానాని నామాట వింటాడు కదా ! అందుకని నాకెంతో యిష్టం - అంది.

అప్పుడు నేను - "లతా - ఎంత యిష్టమో చెప్పవా ? అన్నాను.

నా ప్రశ్న లతకు అర్థంకాలేదు. అప్పుడునేను— "నాకైతే అందరికంటే అమ్మంటే యిష్టం. ఎందుకంటే అమ్మలేకుండానేనుండలేను. ఆ తర్వాత నువ్వంటేనే యిష్టం. నువ్వుకూడా అలాగే నేనంటే ఎంతిష్టమో చెప్పాలి" - అన్నాను.

"మరినీకు మీ నాన్న, బామ్మ, అత్తయ్య, బాబాయి అంటే ఇష్టం లేదా?" అంది లత.

"ఎందుకులేదూ ? కానీ వాళ్ళందరూ నీ తర్వాతే !" అన్నాను. ఇలా గనడం బామ్మదగ్గర నేర్చుకున్నాను. బామ్మనెప్పుడైనా నేనంటే ఎంతిష్టం బామ్మా అనడిగితే—ఎవరైనా నే తర్వాతేరా అంటుంది.

లత నన్ను మళ్ళీ ముద్దుపెట్టుకుని - "నాకైతే ఎవరైనా నీ తర్వాతే అంటే మా అమ్మకంటేకూడా నాకిష్టం"— అంది.

ఇప్పుడేమో చిన్నిగాడొచ్చి లత నన్ను ప్రేమిస్తేనే పెద్దాడినని ఒప్పుకుంటానన్నాడు. లత నాకోసం ఏమైనా చేస్తుంది. నాకా నమ్మకముంది. అందుకని లత దగ్గరకు పొద్దున్న మేమురాసిన ఉత్తరాలు తీసుకుని వెళ్ళాను. కానీ వెంటనే చూపించలేదు. ఆ ఉత్తరాలను జాగ్రత్తగా నిక్కరు జేబులో దాచాను.

లత నన్ను చూసి — "ఏరా—నానీ—" అంటూ పలకరించింది. అక్కడ కాస్తదూరంగా లతా వాళ్ళమ్మ ఉంది. అందుకని నేను లతతో నెమ్మదిగా — "నీతో రహస్యంగా మాట్లాడాలి -" అన్నాను,

లత చటుక్కున ఎత్తుకుని నన్ను తన గదిలోకి తీసుకువెళ్ళి — "ఇప్పుడు చెప్పు - నీ రహస్యమేమిటో— ?" అనడిగింది.

నేను గంభీరంగా - "లతా ! నేను నిన్ను ప్రేమిస్తున్నాను. నువ్వూ నన్ను ప్రేమిస్తావా ?" అనడిగాను.

అప్పుడు లత ముఖం కూడా గంభీరంగా అయిపోయింది - ఇలాగని నిన్ను మీ బాబాయడగ మన్నాడా ? అంది.

"మా బాబాయికాదు - నేనే నిన్ను ప్రేమిస్తున్నాను - " అన్నాను.

లత నన్ను మంచం మీద కూర్చోబెట్టి - "ప్రేమంటే నీకు తెలుసా ?" అంది.

"తెలుసు - మనమిద్దరం పెళ్ళిచేసుకుంటాం - " అన్నాను.

పెళ్ళంటే నీకు తెలుసా?" అంది లత మళ్ళీ.

"ఎందుకు తెలియదు? పెళ్ళిచేసుకుంటే మనమిద్దరం ఒకే గదిలో పడుకోవచ్చు-" సరదాగా బోలెడు కబుర్లు చెప్పుకోవచ్చు—అన్నాను. ఇంకా గౌరవం గురించీ, చేగోడీల గురించీ చెప్పలేదు. ఇలాంటివి తెలివైనవాళ్ళు ముందు చెప్పరుగధా !

లత ఆశ్చర్యపడింది. పెళ్ళంటే దానికి తెలియదుట- "నీకు చాలాతెలుసురా నానీ !" అంది.

"మరి నన్ను పెళ్ళిచేసుకుంటావా?" అన్నాను.

"ఏమో—అప్పుడే చప్పలేను. నేను చాలా ధైర్యవంతుణ్ణి కానీ పెళ్ళి చేసుకోను." అంది లత.

"ఏం?" అన్నాను.

"ధైర్యవంతుడైతే నాకే కష్టాలొచ్చినా రక్షిస్తాడు. అందుకని ! అంది లత

"అయితే యింకేం - నేను చాలా ధైర్యవంతుణ్ణి - తెలుసా! నాకు కప్పలన్నా, బల్లులన్నా అస్సలు భయం లేదు-" అని "ఆ చిన్నిగాడైతే వాటికన్నింటికీ భయమే! అన్నాను గొప్పగా.

"చిన్నిగాడెవరు?" అంది లత.

అప్పుడు నేను లతకు చిన్నిగాడి గురించి అంతా చెప్పేశాను. అలా చెప్పడంలో నాకు తెలియకుండా మొత్తం జరిగిందంతా చెప్పేశాను.

"నువ్వన్నీ అబద్ధాలు చెబుతున్నావు-" అంది లత.

"నువ్విలాగంటావని నాకు తెలుసులే - అందుకనే ఉత్తరాలు కూడా తీసుకొచ్చాను చూడు-" అంటూ నానిక్కరు జేబులోని ఉత్తరాలుతీసి చూపించాను. మొత్తం మూడుత్తరాలవి.

లత మొదటి ఉత్తర్వం చూసి- "నీ ఉత్తరం చూస్తుంటే నీ అక్షరాలు వామనుడి అడుగుల్లా కనబడుతున్నాయి-" అని నవ్వింది.

"వామనుడి అడుగులా? అవేమిటి?" అన్నాను.

"బలిచక్రవర్తి వామనుడికి మూడడుగుల నేల దానమిచ్చారు. వామనుడు రెండే రెండు అడుగులతో మొత్తం ప్రపంచాన్నంతా ఆక్రమించాడు. మూడో అడుగు పెట్టడానికెక్కడా చోటు లేకపోతే బలిచక్రవర్తి తన తలను చూపించాడు. నీ అక్షరాలు కూడా అంతే! గట్టిగా రెండు పదాలు రాయడానికి కాగితం రెండువైపులా చాలలేదు-" అంటూ నవ్వింది లత.

లత చెప్పింది నాకు సరిగ్గా అర్థం కాలేదు -" అసలు వామనుడెవరు?" అనడిగాను.

"వామనుడంటే విష్ణుమూర్తి అవతారం -" అంది లత.

అంటే దేవుడి అవతారమన్నమాట. లతకు నేనంటే యిష్టం కదా - అందుకని నన్ను గొప్పవాళ్ళతోటే పోలుస్తుంది మరి.

తర్వాత లత మా యిద్దరి ఉత్తరాలూ చూసి-" చిన్నిగాడు నిన్ను మోసం చేశాడు. వాడన్నీ గీతలూ, సున్నాలూ రాశాడు. అవే అక్షరాలని అబద్ధం చెప్పాడు. వాణ్ణిలా పిల్చుకునిరా-" అంది.

"వద్దు లతా: నేనూ అలాగే చేశాను కదా!" అన్నాను.

"నువ్వలా చేయడమేమిటి? ఎంచక్కా అక్షరాలు రాస్తేనూ - నీ ఉత్తరం నేను చిన్నిగాడికి చదివ్వినిపిస్తాను - ఇలా పిల్చుకునిరా -" అంది లత.

నేను అక్షరాలే రాశాననగానే నాకెంతో సంతోషం కలిగింది. వెంటనే వెళ్ళి చిన్నిగాణ్ణి పిల్చుకుని వచ్చాను. వాడికి అసలు సంగతి చెప్పలేదుగా - అందుకని హుషారుగానే వచ్చాడు. అప్పుడు లత వాడి ఉత్తరాన్ని చూపించి దెబ్బలాడేసింది వాడు వెంటనే నిజం ఒప్పేసుకుని - "మరి నానిగాణ్ణి కూడా తిట్టు-" అన్నాడు

"నానిగాణ్ణెందుకూ తిట్టడం - వాడెంచక్కా ఉత్తరం రాస్తేనూ-" అంది లత.

అదేం ఉత్తరం ? అన్నీ పిచ్చిగీతలూ, సున్నాలూనూ-" అన్నాడు చిన్నిగాడు.

"ఇవి పిచ్చిగీతలా – నీకు చదవడం రాకపోతే సరి -" అని - మహారాజశ్రీ పూజ్యునీయుడైన సత్యనారాయణకు నాని నమస్కరించి వ్రాయునది-"అని మొదలుపెట్టింది లత.

అదంతా నేనే రాశానని నాకూ తెలియదు. లత చదువుతూంటే నాకు చాలా సంతోషం కలిగింది. నాలో నేనే నవ్వేసుకుంటున్నాను. ఆపుకుందామన్నా ఆగడం లేదు.

లత ఉన్నట్లుండి నన్నుచూసి – "అదేంటి నానీ ! అలా నీలో నువ్వే నవ్వేసుకుంటున్నావు?" అంది.

అతికష్టంమీద నవ్వాపుకున్నాను, "ఇంకా చదువు లతా! నేనేం రాశానో వినాలనుంది-" అన్నాను.

కానీ లత చదవడం ఆపేసి తనూ నవ్వటం మొదలెట్టింది.

చిన్నిగాడికక్కడ నచ్చలేదు కాబోలు - నాతో నెమ్మదిగా -" ఇక్కణ్ణించి వెళ్ళిపోదాంరా -" అన్నాడు.

ఆ మాటలు విందో లేదో కానీ లత - "ఏమ్ చిన్నీ - నేను నానిని ప్రేమిస్తున్నాను. నువ్వు వాడితో ఆడకపోయావో రోజూ మీ యింటికొచ్చి మరీ నిన్నేడిపిస్తాను" అంది.

చిన్నిగాడు బుద్ధిగా తలూపి "నేనసలిక్కడికి నానిగాడితో ఆడుకుందుకే వచ్చాను. ఊరికే ఏడ్పించడానికని అలాగన్నాను కానీ నువ్వు చెప్పకపోయినా వాడితోనే ఆడుకుంటాను." అన్నాడు.

ఆ తర్వాత చిన్నిగాడు నాతో బాగానే ఆడేవాడు. కానీ వాడికి లతంటే చాలా కోపంగా ఉంది. "నీ రాజకుమారి చాలా తెలివి తక్కువది. నిన్ను ప్రేమించింది కదా - మాంత్రికుడెవరైనా మాయచేస్తే నువ్వేం చేయగలవు? నీకు మాంత్రికుల గురించి బొత్తిగా ఏమీ తెలియదు -" అన్నాడు నాతో.

ఏం నేనేం తక్కువ ? నీకైతే బల్లులన్నా కప్పలన్నా భయం. నాకా భయంలేదు - " అన్నాను గొప్పగా.

చిన్నిగాడు నవ్వేశాడు - "అసలు సంగతి నీకు తెలియదుగా. అందుకే నీకు బల్లులన్నా, కప్పలన్నా భయంలేదు – " అన్నాడు.

మాంత్రికుడు రాజకుమారుల్ని కప్పలుగానో, బల్లులుగానో మార్చేస్తాడుట వాటిని చూడగానే పొరపాటున తను వాటిని చంపితే మనుషులే చచ్చిపోతారని గుర్తుకొచ్చి భయంవేసి చిన్నిగాడలా అరుస్తాడుట.

"అమ్మయ్యో - మాంత్రికుడికి మంత్రాలు తెలుస్తాయన్నమాట. అలాంటి మాంత్రికుడిని నువ్వెలా ఓడించావు ? " అనడిగాను.

చిన్నిగాడు చాలా గొప్పగా ముఖంపెట్టి - "నేను చెప్పినట్లే విన్నావంటే మాంత్రికుడి గురించిన రహస్యాలన్నీ నీకే చెబుతాను - అన్నాడు.


నేను వాడి షరతులన్నింటికీ ఒప్పుకున్నాను.


పూర్వం మాంత్రికులైతే భుజాలనుంచి పాదాలదాకా ఒక్కటే పొడుగ్గా ఉండే చొక్కా వేసుకునేవాళ్ళుట.

వాళ్ళకు గెడ్డాలూ, మీసాలూ ఉండేవిట. ఎప్పుడూ కోపంగానే చూసేవాళ్ళుట నవ్వినాసరే అహ్హహ్హా అని పెద్దగా చప్పుడు చేసేవారుట చేతిలో మంత్ర దండం ఉంటుండిట. మనకు అర్థంకాని భాషమాట్లాడే వాళ్ళుట.

ఇప్పుడలా ఉంటే మాంత్రికులెవరో వెంటనే తెలిసిపోతుంది కదా! అయినా ఇప్పుడు మనుషులెక్కువైపోయారు. అన్నిచోట్లా ఊళ్ళొచ్చేస్తున్నాయి. అడవులూ, కొండలూ తగ్గిపోతున్నాయి. అందుకని మాంత్రికులుండడానికి వేరేచోటులేక వాళ్ళూ మనుషుల మధ్యనే ఉంటున్నారుట.

ఇప్పుడు మాంత్రికులు సన్నగా పొడుగ్గా అందంగా ఉంటారుట. వాళ్ళకు గెడ్డాలుండవు కానీ మీసాలుంటాయిట. ఎప్పుడూ నవ్వుతూ ఉంటారుట. మంచిగా మాట్లాడుతారుట. వాళ్ళెంత తెలివైన వాళ్ళంటే - వాళ్ళు చెడ్డపనులు చేసినాసరే -



ఎవరూ వాళ్ళని తిట్టరు సరిగదా పొగుడుతారట. మంచిగా అనిపిస్తూనే మంచిగా మాట్లాడుతూనే అందర్నీ మాయచేస్తారుట. అందరికీ అన్యాయం చేస్తారుట. మాంత్రికుల కారణంగా ఎందరో చచ్చిపోతారుట. అయినాసరే ఎవ్వరూ వాళ్ళ నసహ్యించుకోకుండా ప్రేమిస్తారుట.

"ఇవన్నీ నీకెలా తెలిసాయి ?" అన్నాను ఆశ్చర్యంగా.

"నన్నో రాజకుమారి ప్రేమించిందన్నానుగా. అది చెప్పింది." అన్నాడు చిన్నిగాడు.

"నువ్వు చెప్పినవన్నీ వింటే అమ్మా, నాన్న, బామ్మా- అందరూ మాంత్రికులే ననిపిస్తోంది." అన్నాను భయంగా.

"అలాకాదు. వాళ్ళందరికీ నిజంగానే మనమంటే యిష్టం. మాంత్రికులంటే బయటి వాళ్ళలోనే ఉంటారు. మనం జాగ్రత్తగా పరీక్షించి వాళ్ళెవ్వరో తెలుసుకోవాలి. వాళ్ళకు తెలియకుండా వాళ్ళ మోసాన్ని బయటపెట్టాలి. అంటే మనం కూడా వాళ్ళతో మంచిగా ఉండి నమ్మించాలి. అప్పుడే మనం వాళ్ళనోడించగలం-" అన్నాడు చిన్ని.

"మాంత్రికులతో నాకేంపని ? అసలు నేను వాళ్ళజోలికి వెళ్ళకపోతే వాళ్లూ నాజోలికి రారుకదా !" అన్నాను.

"మరి నీ రాజకుమారిని ఏ మాంత్రికుడైనా మాయచేస్తే చూస్తూ ఊరుకుంటావా ?" అన్నాడు చిన్నిగాడు.

"ఊరుకోను కానీ అందుకో ఉపాయమాలోచించాను" అన్నాను. అదేమిటని చిన్నిగాడడిగినా చెప్పలేదు.

బామ్మ రోజూ పూజచేసుకునే దేవుణ్ణి ఏం కోరుకుంటే అది జరిగిపోతుందట. లతను ఏమాంత్రికుడూ మాయచేయకుండా కాపాడమని ఆ దేవుణ్ణే ప్రార్థిస్తే ఇంక ఏ సమస్యా ఉండదు.

ఈ విషయం చిన్నిగాడికి చెప్పలేదు. చెబితే వాడు ఆ దేవుడి దగ్గరకెళ్ళి— లతను మాంత్రికుడు మాయచేసేలా చేసేస్తాడేమోనని నా భయం.

చిన్నిగాడు మా ఊళ్ళో వో పదిరోజులున్నాడేమో తర్వాతేమో వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయేటప్పుడు నాతో "నీ రాజకుమారినెలా రక్షించుకుంటావో ఏమో- నాకు చాలా జాలేస్తోంది. అసలే నువ్వు చిన్నవాడివీ అమాయకుడివీ కూడాను—" అన్నాడు.

## 4

ఆ తర్వాత కొన్నాళ్ళకే అత్తయ్య అత్తారింటికెళ్ళిపోయింది. బాబాయి కుద్యోగ మొచ్చి బొంబాయెళ్ళిపోయాడు.

నన్నేమో బళ్ళోవేశారు. నేను చాలా తెలివైనవాణ్ణిగా - అందుకని బళ్ళో మేసారు చెప్పగానే అన్నీవచ్చేసేవి. అందుకని యింట్లో యింకేమీ చదివేవాణ్ణి కాదు. అమ్మ నాన్న నన్ను దెబ్బలాడే వారు. అన్నీవచ్చేస్తే యింకేం చదువుకుంటాను ? ఆ సంగతి బామ్మకూ, లతకూ చెప్పుకున్నాను. వాళ్ళు నా మాటే రైటన్నారు.

ఇంటి దగ్గర ఎప్పుడూ ఎక్కువగా లతతో ఆడుకునేవాణ్ణి. అత్తయ్య వెళ్ళిపోయిందని బెంగెట్టుకున్నాననుకుని - అంతా నన్ను లతతో ఆడుకోనిచ్చేవారు. లతానేనూ ప్రేమించుకున్నామని ఎవరికీ చెప్పలేదు. లత ఆ విషయం రహస్యంగా ఉంచమంది. ప్రేమ గురించి ముందు పెద్దవాళ్ళకు చెప్పకూడదుట.

ప్రేమించుకున్న వాళ్ళింకా ఏం చేయాలో నేను తెలివిగా పెద్దవాళ్ళ నుంచే చాలా తెలుసుకున్నాను.

మొదటి దేమిటంటే ప్రేమించుకున్నవాళ్ళు త్యాగం చెయ్యాలి. త్యాగమంటే అమ్మ నాకు నాలుగు చేగోడీలిస్తే అందులో రెండు లతకివ్వడం. నేను లతకోసం చాలాసార్లు త్యాగం చేశాను. కానీ లతకూడా నన్నింకా ప్రేమించిందిగా - అందుకని తనూ త్యాగం చేసేది. నా త్యాగం కంటే లత త్యాగం తియ్యగా ఉండేది. అంటే లత నాకోసం మిఠాయి. గులాబ్‌జాం, జిలేబీ లాంటివి తెచ్చిచ్చేది.

రెండో దేమిటంటే ప్రేమికుడు ప్రియురాలికోసం సాహస కార్యాలు చేయాలి. సాహసకార్యమంటే పక్కింటికి వెళ్ళి పిన్నిగారింకా సీరియల్ చదవకుండానే వారపత్రిక సంపాదించి లతకివ్వడం. ఈ సాహస కార్యం రెండుసార్లే చేశాను. మూడోసారి పక్కింటి పిన్నిగారు అమ్మకు చెప్పేసింది. అమ్మ నాన్నకు చెప్పేసింది. నాన్న నన్ను గట్టిగా తిట్టి-అలా ఎందుకు చేశావని అరుస్తూ అడిగాడు. నేను మాత్రం లతా నేనూ ప్రేమించుకున్నామని చెప్పలేదు. మళ్ళీ సాహసకార్యం చేయలేదు. అయినా రెండుసార్లు చేశావుకదా అదిచాల్లే అని లత చెప్పింది.

మూడో దేమిటంటే ప్రేమించుకున్న వాళ్ళెప్పుడూ ఒకరిగురించి ఒకరు ఆలోచించుకోవాలిట. ఒకరికొకరు కల్లో కనపడాలిట. నేను రోజూ తనకు కలలో కనబడుతున్నానని లత నాకు చెప్పింది. అబద్ధమెందుకూ లత ఎప్పుడూ నాకు కలలో కనబడలేదు. రాత్రి బామ్మదగ్గర పడుకుని రామాయణం వింటాను కదా- ఎందుకో అప్పుడు నాకు అసలు లత గురించి గుర్తురాదు. కలలో నాకు చాలా సార్లు రాముడూ, ఆంజనేయుడూ కనిపించారు. అప్పుడు నేను వాళ్ళకు దణ్ణం పెట్టుకున్నానుకూడా. మరి నేను లతకు కల్లో కనిపిస్తున్నానందిగా - అందుకని బాగుండదని నేనుకూడా లత నాకు కల్లో కనిపిస్తోందని అబద్ధం చెప్పేశాను. అబద్ధం చెప్పడం నాకునచ్చలేదు. ఎప్పుడో అది అబద్ధమని చెప్పేస్తాను.

అయితే కొన్ని అబద్ధాలు చెప్పకతప్పదు. అమ్మ నన్ను దగ్గరగా తీసుకుని —"మానానిగాడికి ఆటలంటే యిష్టమా ? చదువంటే యిష్టమా ? అంటుంది. అప్పుడు నేను కాసేపు సందిగ్ధంలో పడి అబద్ధం చెప్పేస్తాను. పిల్లలెవరికైనా ఆటలంటేనే యిష్టముంటుంది. కానీ చదువంటే యిష్టమని చెబితే పెద్దాళ్ళు సంతోషిస్తారు.

లతా, నేనూ ఎంతో ప్రేమగా ఉంటున్న విషయం కూడా అందుకే రహస్యంగా ఉంచాలని లత నాకు చెప్పింది.

సరేలే అనుకున్నాను కానీ నాకో కొత్త కష్టం వచ్చింది.

నేను ఇంట్లో బాగా చదవడం లేదని నాన్న నా కోసం ఓ ప్రైవేటు మేస్టర్ని పెట్టాడు.

"వాడి కన్నీ వచ్చేసు కదురా - ఇంట్లో కూడా మళ్ళీ చదువెందుకూ-" అని బామ్మ నాన్నను దెబ్బలాడితే - "వీడి కన్నీ తొందరగా వచ్చేస్తున్నాయి కాబట్టే యింట్లో ప్రైవేటు. అప్పుడు డబల్ ప్రమోషన్ వస్తుంది. వీడింత ఉండగానే కలెక్టరైపోతాడు. అని నాన్న బామ్మకు చెప్పుకున్నాడు.

కలెక్టరంటే చాలా గొప్ప ఉద్యోగం పోలీసులందరూ కలెక్టరుకు దణ్ణంపెట్టి కలెక్టరు చెప్పినట్లే చేస్తారుట. పోలీసులంటే దొంగాళ్ళకు భయం. మాంత్రికులకూ భయమే అయుంటుంది. అందుకే నాకు కలెక్టరవ్వాలనుంది. అసలు నాకు పోలీసు వీపుమీద కూర్చుని గుర్రపు ఆట ఆడాలని సరదాగాఉంది.

నాకిప్పుడే కలెక్టరై పోవాలనుంది. కానీ చదువుకోవాలంటే విసుగ్గా ఉంది. ఏం చేయాలా అని సందిగ్ధంలో పడి పోనీ కలెక్టరు కాస్త ఆలస్యంగా అయితేనేం అనుకున్నాను. కానీ ప్రైవేటుమేస్టరు వదలడే ?

బళ్ళో పాఠాలు చాలా సులువుగా ఉండేవి. కానీ ప్రయివేటు మేస్టారు అవికాకుండా ఏవో కష్టమైన పాఠాలు చెప్పేవాడు. అవి నాకు వచ్చేవి కావు.

"కష్టపడి చదువు. అన్నీ వస్తాయి" - అంటాడు మేస్టారు.

బళ్ళో చదువుకుంటున్నానా, యింటి దగ్గర ప్రైవేటప్పుడు చదువుకుంటున్నానా - మళ్ళీ యింకా చదువేమిటి ? అస్తమానూ చదువుకుంటే యింక ఆటలెప్పుడు ? లతను ప్రేమించేదెప్పుడు ?

వాళ్ళకి వీళ్ళకి చెప్పడమెందుకని ఈ విషయం మేస్టర్నే అడిగేశాను. మేస్టారు నాకు వెంటనే తొడపాశంపెట్టి - "ఏ రోజు పాఠాలారోజు అప్పచెప్పక పోతే రోజుకోలా నిన్ను బాధపెడతాను. అన్నాడు.

వాడు తొడపాశం పెట్టిన చోట నాకు చాలా మంటపుట్టింది. వెంటనే పరుగున బామ్మ దగ్గరకు వెళ్ళిపోయి మేస్టారు నన్ను కొడుతున్నాడని చెప్పాను. బామ్మకు నేనంటే యిష్టం కదా - వెంటనే కోపంగా మేస్టారు దగ్గర కొచ్చేసింది.

బామ్మింకా ఏదో మాట్లాడేలోగా మేస్టారేంచేశాడో తెలుసా ?

"బామ్మగారూ - మీ ముఖంలో దివ్యతేజస్సుంది. ఒక్కసారి మీ కాళ్ళకు నమస్కరించనివ్వండి-" అంటూ చటుక్కున బామ్మ కాళ్ళకు వంగి దణ్ణం పెట్టాడు.

అంతే - బామ్మ కోపం మర్చిపోయి మేస్టారితో ప్రేమగా మాట్లాడ్డం మొదలు పెట్టింది. మేస్టారేమో ఆగకుండా బామ్మను పొగిడేస్తున్నాడు.

ఇంకలాభంలేదని నేను బామ్మను గోకాను. బామ్మ పట్టించుకోకుండా మేస్టారి పొగడ్తలు వినేస్తోంది. ఆఖరికి నేను - "బామ్మా !" అని గట్టిగా అరిచాను.

అప్పుడు బామ్మ ఉలిక్కిపడింది. నేను చాలాసార్లు ఉలిక్కిపడుతూంటాను. మనం బాగా ఆడుకుంటూంటే పెద్దాళ్ళు మధ్యలో "నానీ !" అనిగట్టిగా అరుస్తారు. అప్పుడు మనం కంగారుపడతాంగదా - అదే ఉలిక్కిపడ్డమంటే ! ఎప్పుడూ నేనే ఉలిక్కిపడ్డం అయ్యేది. ఇప్పుడు నా పిలుపుకు బామ్మ ఉలిక్కిపడితే నాకు చాలా సంతోషం కలిగింది.

బామ్మ ఉలిక్కిపడిందా - ఆ తర్వాత నేను చెప్పకుండానే మేస్టార్ని అడిగేసింది - "ఏమిటి - మా నానిగాణ్ణి కొట్టావుట"- అంటూ అప్పుడు నాకు బామ్మ మీద చాలా కోపం వచ్చింది. తప్పచేసిన వాళ్ళని అలాగేనా మందలించేది ? అసలు బామ్మ మాటల్లో కోపంలేదు. పైగా నవ్వుతోంది కూడా.

"మీ నానిని నేను కొట్టడమా? భలేవారే - వాడంటే నాకెంతో ముద్దు. వాడి పాలబుగ్గలు చూస్తూంటే ఎవరికైనా కొట్టబుద్ధేస్తుందా? వాడు పాఠం వినడం యిష్టం లేనప్పుడల్లా కొట్టానని అబద్ధంచెప్పి పారిపోతున్నాడు —" అన్నాడు మేస్టారు.

అప్పుడు బామ్మ నన్నే తిట్టింది.

"బామ్మా - మేస్టారు అబద్ధం చెబుతున్నాడు. నన్ను నిజంగా కొట్టాడు-" అన్నాను.

"కొడితే ఎక్కడ కొట్టానో చూపించు -" అన్నాడు మేస్టారు.

వెంటనే మేస్టారు తొడపాశం పెట్టిన చోటు చూపించాను. బామ్మ అక్కడ చూసి- "భడవకానా - అన్నీ అబద్ధాలు -" అంది.

నిజంగానే అక్కడే గుర్తులేదు. నేను చాలా ఆశ్చర్యపడ్డాను. బామ్మ వెళ్ళిపోయింది.

అప్పుడు మేస్టారు - "నేను చెప్పినట్లు బుద్ధిగా పాఠాలు చదువుకున్నావా సరేసరి ! లేకపోతే రోజూ నీకు దెబ్బలే! నేను కొట్టేదెబ్బలు నీకు నొప్పిపెడతాయి కానీ నేను కొట్టినట్లు ఎవ్వరికీ తెలియదు. నేను మాంత్రికుణ్ణి తెలిసిందా ?" అన్నాడు.

మాంత్రికుడనగానే నాకు భయమేసింది. అప్పటిదాకా నేను మేస్టారు గురించి అలా ఆలోచించలేదు. నాకప్పుడు చిన్నిగాడి మాటలు గుర్తుకొచ్చాయి. మేస్టార్ని పరీక్షగా చూశాను.

వాడు చిన్నిగాడు చెప్పినట్లే సన్నగా పొడుగ్గా అందంగా ఉన్నాడు. గెడ్డ లేదుకానీ మీసాలున్నాయి. ఆ మీసాలవల్ల వాడింకాబాగున్నాడు. వాడెప్పుడూ నవ్వుతూనే ఉంటాడు. ఆఖరికి నన్ను కొట్టేటప్పుడు కూడా నవ్వుతూనే ఉంటాడు.

# బకాయి పుట్టుక

శ్రీ సి. హేమచందర్

గడ్డ విరచి గట్టుపెట్టి
విత్తు చల్లి నీరు పెట్టి
నారు పెంచి నాటు వేసి
కలుపు తీసి పిండి చల్లి
కాలు అరుగ తిరిగి తిరిగి
చేనుచుట్టు కాపుకాసి
పైరు పెంచి పెద్దజేసి
కండలెల్ల నరగదీసి
గాలివీచ బెదరి బెదరి
మెరపు మెరయి నదరి నదరి
మబ్బుపట్ట బక్క చిక్కి
గతిసారిగాలొచ్చి
గింజలన్నీ రాల్చిపోతే
ఆసామికి బకాయిపడి
తిండి గడవక తెల్లమొగంవేశాం
ఈసారయిన
కష్టం మిగులుద్దని
ఆశతోన ఎదురుజూచి
కోతకోసి ఓదెవేసి
ఒరుపుచూసి ఓదెలెల్ల
ప్రోగుజేసి ఒకటిచేసి
నిదురమాని కాపుకాసి
కుప్పవేసి కూసుంటే
పల్లెమోతై, ఉద్యోగంలేకున్నా
నాగరికత మోజులో
పట్నం వెళ్ళిన కామందు
బస్తీ వదలి పల్లెకొచ్చి
పాత బకాయి లెక్కగట్టి
పండిందంతా ఎత్తుకు పోతుంటే
కూలైనా మిగలలేదని
నేలచూపులు చూసే నా ఆలిని
చూడలేక సిగ్గుతో పక్కకు తిరిగా
మన పుట్టుక బకాయిపుట్టుకని
కండలుండగా కన్నీరెందుకు
మంచి రోజులొత్తాయని ఓదార్చా

*

వాడు చేసేవన్నీ చెడ్డపనులే! నన్ను అస్తమానూ చదువుకోమంటాడు కొడుతూంటాడు. తిడుతూంటాడు. అయినాసరే అమ్మ, నాన్న, బామ్మ, అంతా వాణ్ణి మంచివాడనే అనుకుంటున్నారు. వాడు రాగానే బోలెడు మర్యాద చేసేస్తున్నారు. వాడిమీద నేనేం చెప్పినా ఎవరూ నమ్మడంలేదు సరిగదా వాడొచ్చేక నాకు చదువు బాగావస్తోందని మెచ్చుకుంటున్నారు. అందర్నీ వాడు మాయచేసేస్తున్నాడు.

అంటే ఈ మేస్టారు మాంత్రికుడేకదా- పైగా తనే ఆ విషయం చెప్పేశాడు నాకు. బహుశా నా గొప్పతనం తెలిసుండదు.

ఇప్పుడు నేనేం చేయాలి?

మాంత్రికుడొచ్చేశాడు. ఇంక రాజకుమారికి ప్రమాదం. అందుకని లతక్కి విషయం చెప్పాలి.

ఆ రాత్రి మేస్టారు వెళ్ళిపోగానే లతయింటికి వెళ్ళి - "లతా! నువ్వు జాగ్రత్తగా ఉండాలి. మాంత్రికుడొచ్చేశాడు -" అని చెప్పాను.

లత అప్పుడు నన్ను అన్నీ అడిగి తెలుసుకుంది. జాగ్రత్తగా ఉంటానని మాటిచ్చింది. కానీ మాట నిలబెట్టుకోలేదు. మర్నాడు నాకు ప్రయివేటు జరుగుతూంటే తనూ వచ్చేసింది. మాంత్రికుడు మాయచేసి రాజకుమారినెత్తుకు పోతాడని నేను భయపడుతూంటే రాజకుమారే మాంత్రికుడి దగ్గరకు వచ్చేయడం నాకు నచ్చలేదు. కానీ మేస్టారెదురుగుండా ఆ విషయం చెప్పలేదు. నేను తెలివైనవాణ్ణి కదా!

అప్పుడు మేస్టారు, లత చాలా మాట్లాడుకున్నారు. ఇద్దరూ నవ్వుకున్నారు కూడా. వాళ్ళలా నవ్వుకోవడం నాకు నచ్చలేదు. అందుకే మేస్టారు వెళ్ళిపోయాక లతను దెబ్బలాడాను.

"అంతా నీ మంచికే మరి! ఈ రోజు నీకు మేస్టారు పాఠాలెక్కువ చెప్పలేదు. నిన్ను కొట్టలేదు. నేను ఇక్కడే ఉండి నీ మేస్టారికి మంత్రం వేశాను-" అంది లత.



అదీ నిజమే అనిపించింది నాకు.

ఆ రోజునుంచీ ప్రతిరోజూ లత నాతోపాటు తనూ ప్రయివేటుకు వచ్చేది. కూడా తనక్లాసు పుస్తకాలు తెచ్చుకొచ్చేది. తనకూ కొన్ని పాఠాలు అర్థంకాకపోతే మేస్టారినడిగి తెలుసుకుంటున్నానని పెద్దాళ్ళకు చెప్పిందికానీ అది అబద్ధం. అది మేస్టారితో సినిమాల గురించీ, కథలగురించీ, పుస్తకాలగురించీ మాట్లాడేది ఒకో సారి ఇందిరాగాంధీ గురించి కూడా మాట్లాడేది. మేస్టారేమో లతను పొగిడేసేవాడు. లత చాలా అందంగా ఉంటుందిట. చాలా తెలివైనదిట. లత ఏం బట్టలు కట్టుకున్నా ఆ బట్టలకూ కూడా అందం వచ్చేస్తుందిట. లత ముఖంలో ముక్కు బాగుంటుందిట. లతనవ్వితే బాగుంటుందిట. కోపంగా ఉంటే ఇంకాబాగుంటుందిట. అలా అనే వాడా—అలాగని లతకు కోపం తెప్పించేవాడు కాదు. అయినా ఎంతసేపూపొగుడు తూంటే లతకు కోపమెలాగొస్తుందీ?

లత చాలా సంబరపడేది. రోజూ ప్రయివేటు మేస్టారికోసం ఎదురుచూసేది. వాళ్ళిద్దరూ ఎక్కువగా మాట్లాడుకోవడం నాకు నచ్చలేదు. కానీ ఆ సమయంలో నాకు చాలాబాగుంటోంది. మేస్టారు నాకు రోజూ ఓ కొత్తరకం ఆట నేర్పుతున్నాడు నేనది ఆడుకుంటూ హాయిగా ఉండేవాణ్ణి. మధ్యలో వాడిమాటలూ వినేవాణ్ణి.

ఇలా కొన్నాళ్ళు జరిగేసరికి నాకు అనుమానం వచ్చింది. మేస్టారు నాకు పాఠాలు చెప్పడం మానేసి లతతోనే మాట్లాడేస్తున్నాడు. ఇలాగైతే నాకు చదువెలా గొస్తుందీ ? కలెక్టరెప్పుడవుతానూ ? పోలీసులచేత పనులెప్పుడు చేయించు కుంటానూ ?

ఒక రోజున మేస్టార్ని అడిగేశాను. అప్పుడు వాడు నవ్వుతూ - "నువ్వు చాలా తెలివైన వాడివికదా - నువ్వు బళ్ళో చదివేదిచాలు. చక్కగా యిలాగే ఆడుకో - ఇంట్లో మాత్రం ఆడుకుంటున్నట్లు చెప్పకు -" అన్నాడు.

ఆ తర్వాత నేను లతతో - "నువ్వూ నేనూ ప్రేమించుకున్నాం గదా - నువ్వు నా మేస్టరితో ప్రేమగా మాట్లాడుతున్నావు. నాకు నచ్చలేదు-" అన్నాను.

అప్పుడు లత వెంటనే- "మొత్తానికి మగాడిననిపించుకున్నావురా - నానిగా -" అంది.

"మరినేను మగాణ్ణేగా !" అన్నాను గర్వంగా.

లతేమో అప్పుడు నా రెండు బుగ్గల మీదా రెండు ముద్దులు పెట్టుకుని — "రోజూ మేస్టారు నిన్ను బాధపెడుతున్నాడు గదా - నిన్ను రక్షించడం కోసం వచ్చాను, నేనిప్పుడు నీ మేస్టారి మనసు మారుస్తున్నాను. అందుకోసం నాకెన్నో పనులున్నాసరే త్యాగం చేసి యిక్కడకు వస్తున్నాను. మరి నేను నిన్ను ప్రేమిస్తు న్నాను కదా - అంది.

అవును మరి. లత నన్ను ప్రేమించింది. అందుకని నాకోసం త్యాగం చేస్తోంది. అంతాబాగానే ఉందికానీ నా మేస్టారు మాంత్రికుడు. లత మేస్టారి దగ్గరకు అస్తమానూ వెళ్ళడం మంచిది కాదు. ఎప్పుడైనా మేస్టారు లతను మోసం చేయవచ్చు.

అప్పట్నుంచీ నేను మేస్టార్ని జాగ్రత్తగా కనిపెట్టడం మొదలెట్టాను. అప్పుడే నాకింకో విషయం తెలిసింది. లత నాకోసం త్యాగం చేస్తున్నానంది కానీ మేస్టారితో మాట్లాడ్డం దానికీ యిష్టమే ! వాళ్ళిద్దరూ చాలా యిష్టంగా మాట్లాడు కుంటున్నారు. నేను వినేస్తానేమోనని కొన్నికొన్ని మాటలు నెమ్మదిగా చెప్పుకునే వారు. అప్పుడు నేనేం చేశానో తెలుసా — వాళ్ళమాటలు వినకుండా నేనింకో లోకంలో ఉన్నట్లు నటించేవాణ్ణి. అప్పుడు నేనింకోలోకంలో ఉన్నాననుకుని కాస్త గట్టిగా మాట్లాడుకునే వాళ్ళు. అవి నేను వినేసేవాణ్ణి.

ఆ మాటలు వినగానే నాకు చాలా తెలిశాయి. లత మేస్టార్ని మా యింట్లోనే కాదు—ఇంకా ఎక్కడో పార్కుల్లో కలుసుకుంటోంది. అది బడికి వెడుతుంది. కదా - బడికని చెప్పి పార్కుకి వెళ్ళిపోయి మేస్టార్ని కలుసుకుంటోంది.

అయితే ప్రమాదమే - రాజకుమారి మాంత్రికుణ్ణి పూర్తిగా నమ్మేసింది. మరి నేను మాంత్రికుణ్ణి ఓడించి పంపేయకపోతే రాజకుమారి పని అయిపోతుంది.

కానీ మాంత్రికుణ్ణి ఓడించడమెలా ?

బాగా ఆలోచించాను. ఎంత ఆలోచించినా నాకే ఉపాయమూ తోచలేదు చివరకు వెళ్ళి బామ్మనే అడిగాను.

"మాంత్రికుడి గొడవ నీ కెందుకురా ?" అంది బామ్మ విసుగ్గా.

"విసుక్కోకే బామ్మా ! ఇది నాకు చాలా పెద్ద సమస్య-" అన్నాను.

"వేలెడంతలేవు - వెధవ కబుర్లూ నువ్వూనూ - సమస్యట సమస్య ఫో - అవతలకి -" అంటూ గసిరింది బామ్మ.

అలాగందంటే బామ్మ నాకింకే ఉపాయమూ చెప్పదన్నమాట.

మరేం చేయాలీ? మేస్టారు నాకు పాఠాలు చెప్పకుండా లతతో కబుర్లు చెబుతున్నాడని యింట్లో చెప్పేస్తే !

మేస్టారు మాంత్రికుడు కదా - అందుకని నామాట ఎవరూ నమ్మరు. ఒక వేళ నమ్మేరంటే మేస్టారిని మానిపించేస్తారు. అయినా లత మేస్టార్ని కలుసుకుం టూనే ఉంటుంది. ఓడిద్దామన్నా నాకు మాంత్రికుడు దొరకడు. అందుకని యింట్లో మేస్టారి గురించి చెడుగా ఏమీ చెప్పకూడదు.

మరింకేం చేయాలీ ?

నేనిలా ఆలోచిస్తూనే ఉన్నానా - నేనేదైనా చేసేస్తానని మాంత్రికుడికి భయమేసిందో ఏమో - వాడు లతా వాళ్ళ అమ్మా నాన్నలతో తను లతను పెళ్ళి చేసుకుంటానని చెప్పేశాడు. అంతే - లత అమ్మా, నాన్నా కలిసి మాంత్రికుడి అమ్మానాన్నలకు ఉత్తరం రాసేశారు.

అప్పుడు నేను లతను కలుసుకుని— "నువ్వు నన్ను ప్రేమిస్తున్నావుకదా- మరి మాంత్రికుడినెలా పెళ్ళి చేసుకుంటావు ?" అనడిగాను.

"నీకోసం త్యాగం చేస్తున్నాను. నేను పెళ్ళి చేసుకోకపోతే మాంత్రికుడు నిన్ను బల్లిగా మార్చేస్తానని బెదిరిస్తున్నాడు-" అంది లత.

"లతా- నువ్వు నాకోసం త్యాగం చెయ్యొద్దు. నేను బల్లినైపోయినా పరవా లేదు. నువ్వు మాత్రం మాంత్రికుడిని పెళ్ళి చేసుకోవద్దు-" అందామనుకున్నాను. కానీ నిజంగా నేను బల్లినైపోతే - అమ్మ నాకోసం బెంగపెట్టుకోదూ ?

అబ్బా - త్యాగం చేయడం చాలా కష్టం !

నాకోసం లత మాంత్రికుడినే పెళ్ళాడతానంటోంది. అది చాలా పెద్ద త్యాగం. అంత త్యాగం చేస్తున్న లతని నేనెలా రక్షించాలి ?

లతకు మాంత్రికుడితో పెళ్ళయిపోతే అది చాలా కష్టాలు పడుతుంది. ఈ సంగతి చిన్నిగాడు ముందే చెప్పాడు. ఎలాగైనా వాడు నాకంటే తెలివైనవాడు. నేను మాంత్రికుడినేమీ చేయలేననీ వాడు ముందే చెప్పాడు.

ఇదంతా తల్చుకుంటూంటే నాకేడుపు వచ్చేస్తోంది.

## 5

ఆఖరికి అనుకున్నంతా అయింది. మాంత్రికుడు రాజకుమారిని మోసం చేసేశాడు. ఇప్పుడు లత చచ్చిపోతానని ఏడుస్తోందిట.

అసలేమైందంటే మేస్టారి అమ్మా నాన్నా లతను చూసుకుందుకు వచ్చారుగా. వాళ్ళేమో పెళ్ళికావాలంటే పాతికవేల రూపాయలు కావాలన్నారుట, పాతికవేలంటే చాలా ఎక్కువట. లత నాన్నదగ్గర అంత డబ్బులేదుట. ఎంత బతిమాలినా వినకుండా మేస్టారి నాన్నా అమ్మా- "అయితే ఈ పెళ్ళి జరగదు-పో !" అని కోపంగా అనేసి వెళ్ళిపోయారుట.

మేస్టారి నాన్న కూడా పెద్ద మాంత్రికుడుట. వాడికి కట్నం అనే మంత్రం తెలుసుట. ఆ మంత్రం వేస్తే పెళ్ళిళ్ళు కావుట. మేస్టారికి నాన్నంటే భయంట. వాడిని కూడా వాళ్ళ నాన్న బల్లిగా మార్చేస్తాడని భయమో - ఏమిటో మరి!

ఇప్పుడేమో లత యింకెవర్నీ చూడనంటోంది. ఆఖరికి నన్ను కూడా చూడనంటోంది. చచ్చిపోతానని ఏడుస్తోంది.

నాకిదంతా తెలియగానే చాలా ఆవేశం వచ్చేసింది. ఆవేశమంటే కోపం రావడం అన్నమాట! మనదేశంలో ఆవేశం రావడం కూడా చాలా గొప్పట. మా బాబాయి చెప్పాడు.

మరి నేను గొప్పవాణ్ణిగా- అందుకని నాకావేశం వచ్చింది. ఆ సాయంత్రం మేస్టారు మా యింటికి వచ్చారు. వాడసలు విచారంగానే లేడు. మాంత్రికుడుకదా- ఎప్పటిలాగే నవ్వుతున్నాడు.

వాడు ప్రయివేటు చెప్పడానికి గదిలోకి రాగానే నేను తలుపులు వేసేశాను. కోపంగా మేస్టారి వంక చూసి– "ఒరేయ్ మాంత్రికుడూ! అవతల ఆ రాజకుమారి- లత - అలా ఏడుస్తుంటే నీకు నవ్వెలా వస్తోందిరా!" అన్నాను.

మేస్టారు తెల్లబోయి నావంక చూశాడు.

"అలా చూస్తావేంరా? మీనాన్న నీకంటే పెద్ద మాంత్రికుడని ముందుగా నీకు తెలియదా? వాడే మంత్రం వేస్తాడో ముందుగా నీకు తెలియదా? అన్నీ తెలిసీ నా రాకుమారిని మోసం చేస్తావా? నేను లతకు ముందే చెప్పాను- నువ్వు మాంత్రికుడివని. అయినా నీ మాయలో పడిపోయింది-" అన్నాను మళ్ళీ.

వాడు కాస్త కోపంగా నావంక చూసి- "నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?" అన్నాడు.

"తెలుసు. కానీ నీకులా నాకు భయం లేదు. నువ్వు మాంత్రికుడివి. దుర్మార్గుడివి. నిన్ను తిడితే నువ్వు నన్ను బల్లిగా మార్చేస్తావని లత నాకు చెప్పింది, అయినాసరే నిన్ను తిడతాను, నీకేమో మీనాన్న నిన్ను బల్లిగా మార్చేస్తాడని భయం, అందుకేగా లతను ఏడిపిస్తున్నావు. నీకంటే నేనే నయం. మాంత్రికుల్ని తిట్టడానికి భయపడను. నీకైతే మాంత్రికుడు మీనాన్నే అయినాసరే తిట్టడానికి భయమే!" అన్నాను ఇంకా ఆవేశంగా.

అప్పుడు మేస్టారు నామీద చాలాకోప్పడతాడనుకున్నాను కానీ అలా జరగలేదు. వాడు నా దగ్గరగావచ్చి "నువ్వు నన్ను మాంత్రికుడంటావని లత నాకు చెప్పింది. నీగురించీ అన్నీ చెప్పింది. నువ్వంటే నాకు చాలా యిష్టం. ఇప్పుడు నేను ఓడిపోయానని ఒప్పుకుంటాను. నేనేంచేయాలో నువ్వే చెప్పు" అన్నాడు.

"ఏంచేయడమేమిటి? మీ నాన్నేదో మంత్రం పెట్టాడు లతకి, అదేమో చచ్చిపోతానని ఏడుస్తోంది. ఆ మంత్రానికి విరుగుడేమిటో తెలుసుకునిరా. లతను మనిద్దరం కలిసి రక్షిద్దాం—" అన్నాను.

మేస్టారు నన్నెత్తుకుని "అలాగే చేస్తానా—నానీ!" అన్నాడు.

నాకు చాలా సంతోషం కలిగింది. నేను నిజంగానే మాంత్రికుణ్ణి ఓడించేశానన్నమాట! అంటే నామాటల్లోనే ఏదో గొప్ప మంత్రముండి ఉండాలి. అదేమిటో మరి! అప్పుడు నేను ఆవేశంలో ఉన్నాను గదా-ఏంమాట్లాడానో గుర్తులేదు. ఎందుకైనా మంచిదని "నువ్వు నిజంగానే ఓడిపోయావు కదూ!" అన్నాను.

"ఏం- నీకా అనుమానం ఎందుకొచ్చింది?" అన్నాడు మేస్టారు.

"ఎందుకంటే — నువ్వు ఓడిపోకపోతే చెప్పు. మళ్ళీ ఇందాకటి మంత్రమే వేసి ఓడించేస్తాను-" అన్నాను భయపెడుతూ.

"నిజంగానే ఓడిపోయాను -" అన్నాడు మేస్టారు.

"హమ్మయ్య!" అనుకున్నాను మనసులో. మేస్టారు నిజంగా ఓడిపోలేదంటే మళ్ళీ ఓడించడానికి ఇందాక వేసిన ఆ మంత్రమేమిటో నాకు గుర్తుంది దస్తేగా! ఉత్తినే అలా చెప్పి మేస్టర్ని భయపెట్టేశానంతే!

లత మళ్ళీ నవ్వడం మొదలు పెట్టింది. మేస్టారేమో వాళ్ళ అమ్మనీ నాన్ననీ ఎదిరించి లతను పెళ్ళి చేసుకుంటున్నట్టు. అందుకు లత చాలా సంతోషంగా ఉంది.

"ఒరేయ్ నానీ! ఇదంతా నీ గొప్పతనమేరా! నీమూలంగానే ఈపెళ్ళి జరుగుతోంది. నువ్వు నిజంగానే నన్ను మాంత్రికుడి బారినుండి రక్షించావు—" అంది లత.

"మరైతే మళ్ళీ ఆ మాంత్రికుణ్ణే పెళ్ళి చేసుకుంటానంటావేం? అన్నాను కోపంగా.

"మాంత్రికుణ్ణి నువ్వు- ఓడించేశావు కదా! అందుకని వాడు మంచివాడైపోయాడు. మంచివాణ్ణి నేను పెళ్ళి చేసుకుంటే తప్పేముంది?" అంది లత.

"అది సరేలే-మరి మనమిద్దరం ప్రేమించుకున్నాం గదా- నన్ను పెళ్ళి చేసుకోవా?" అన్నాను కోపంగా.

లత సందిగ్ధంలో పడిపోయినట్లుంది- మాట్లాడలేదు.

"నువ్వు నన్ను పెళ్ళి చేసుకోనంటే - చచ్చిపోతానని ఏడుస్తూ కూర్చుంటానంతే!" అన్నాను.

లత గమ్మున నన్నెత్తేసుకుని-" అలాగనకురా! నానీ! అంది.

"మరైతే నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అన్నాను.

"చేసుకుంటాను కానీ యిప్పుడు కాదు. నువ్వేమో ఇంకా చిన్న పిల్లవాడివి. కొన్నాళ్ళైపోతే నువ్వేమో నాకంటే పెద్దాడివై పోతావు. అప్పుడు మనిద్దరం పెళ్ళి చేసుకోవచ్చు. ఈలోగా నువ్వు బాగా చదువుకుని కలెక్టరువై పోవాలి _" అంది లత.

"అవునవును - పోలీసుల్ని భయపెట్టాలి కూడా-" అన్నాను హుషారుగా.

లత నారెండు బుగ్గలమీదా ముద్దు పెట్టుకొని- "నానిగాడికి చాలా తెలివి-" అంది.

తెలివి అనగానే నాబుర్ర బాగా పని చేసింది. "ఏయ్- మరి నేపెద్దాడినైపోతే నువ్వూ. పెద్దదానివై పోవూ- నాకు తెలుసులే- నువ్వు నన్ను మాయచేస్తున్నావు-" అన్నాను.

లత నవ్వేసి - "ఆడపిల్లలు పొడుగెదగరు. మగపిల్లలే పొడుగ్గా అవుతారు. కొన్నాళ్ళుపోతే నువ్వు మీ అమ్మకంటే పొడుగౌతావు తెలుసా? అంది.

నిజమే మరి. అమ్మెప్పుడూ నన్ను పెద్దయ్యాక నాన్నంత పొడుగవ్వాలి అని ముద్దులాడుతూంటుంది. అంటే నేను పొడుగులో అమ్మను దాటించేస్తాననే కదా! అంటే అమ్మ ఇంక ఎదగదన్నమాట. అమ్మే ఏమిటి—నాన్నకూడా ఎదగడు.... వెంటనే నేను - "ఆడపిల్లలే ఏమిటి? పెద్దయ్యాక మగపిల్లలూ ఎదగరు. అసలు పెద్దాళ్ళు ఎదగరు. చిన్నాళ్ళే ఎదిగి పెద్దాళ్ళవుతారు అవునా?" అన్నాను.

"అవున్నా- మానానిగాడికి చాలా తెలివి-" అని లత నన్ను మళ్ళీ బుగ్గల మీద ముద్దుపెట్టుకుంది.

"సరేలే- నువ్వు చెప్పినట్లే నేను పెద్దాణ్ణయ్యాక నిన్ను పెళ్ళి చేసుకుంటాను గానీ- మరి ఈలోగా నీ పెళ్ళి అయిపోతోంది కదా!" అన్నాను అనుమానంగా.

"అబ్బే- ఇది సరదాగా ఉత్తుత్తిపెళ్ళి బొమ్మల పెళ్ళి అన్నమాట!" అంది లత.

నాకు మళ్ళీ అనుమానం వచ్చింది - ఇది ఉత్తుత్తి పెళ్లే అయితే ఇప్పుడూ నన్నే చేసుకోవచ్చు కదా-" అనడిగేశాను తెలివిగా. ఎలాగైనా లతను పెళ్ళి చేసుకోవాలనుంది నాకు.

# జీవుని (ని)వేదన

## శ్రీ వెలుదండ నిత్యానందరావు

ప్రభూ!

అతులిత వైభవ సముపేతమైన నీ
దివ్య సింహపీఠి దిగి నా దరి వచ్చావా?
కరాళ మృత్యు దంష్ట్రాగ్ర డోలికల్లో తూలుచు
మరణశయ్యపైబడి నేడో రేపో చావబోతున్న
రోగిలాంటి నా కుటీరమున
కరుదెంచావా నా తండ్రీ!

నా గుడిసెలో ఒక మూల ఒక్కడనే ముక్కి
నాలో నేనే గొణుక్కుంటున్న మూల్గులాంటి
నా గీతం నీ చెవి సోకగానే
నా కుటి నీ గుడిగా,
నా నుడి నీ నుడిగా మలచి
అనన్యమైన అవ్యాజమైన నీ కృపాకటాక్ష
వీక్షణామృతం నాపై వర్షించావా? దేవా?

నారద తుంబురాది మహా సామవేదజ్ఞు
లధికంగా నీ సన్నిధి పెన్నిధిగా నధివసించియున్నారు
వారి మనోజ్ఞ పదకలిత గాత్ర
మాధురీ మరంద ధారలలో నను నిత్యం
పులకిత గాత్రుడ వవుతావు నీవు

కాని

నేడు వారి రాగం నీ అనురాగానికి నోచుకోలేక
పోయింది
లెక్కకురాని ఈ పిచ్చివాని పాటయే
నీ దయాపాత్రమై ధన్యమైంది
అజ్ఞాన బాల్యచాపల్యంగా భావించి కరుణతో
మన్నించాల్సిన నా ఈ మూర్ఖ సాహసం
విశ్వవీణియ వెలిగించు సుమధురగాన
జ్యోతిలో అమరకిరణంగా భాసించింది.

---

లత మళ్ళీ సందిగ్ధంలో పడిపోయింది. కాసేపాగి - సరేలే - ఇప్పుడే నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను. కానీ మన పెళ్ళయ్యాక-అది ఉత్తుత్తి పెళ్ళైనాసరే-నువ్వు మీ అమ్మదగ్గర ఒక్కసారికూడా పడుకోకూడదు. సరేనా? అంది.

నేను కాసేపాలోచించి-రాత్రిళ్ళుకూడానా? అన్నాను గంభీరంగా.

లత నవ్వేసింది - "అస్సలు పడుకోకూడదు. రాత్రిలేదు పగలులేదు. ఎప్పుడూ నాదగ్గరే ఉండాలి-" అంది.

నాకు క్రోధం వచ్చింది. అయినా ఒప్పుకుందామనుకుని - "పోనీ జ్వరం వచ్చినపుడు...." అన్నాను.

"ఎప్పుడూ వద్దన్నానా?" అంది లత.

"అయితే నేనసలు ఈ జీవితానికే పెళ్ళి చేసుకోను. తెలిసిందా?" అన్నాను కోపంగా.

అంతే-లత బెదిరిపోయి - "అలాగనేయకురా నానీ! పెద్దయ్యాక నన్ను పెళ్ళి చేసుకోవాలిగా-" అంది.

అప్పుడు నాకు అర్థమయింది-అంతా పెద్దయ్యాకే ఎందుకుపెళ్ళి చేసుకుంటారో! పెద్దాళ్ళు అమ్మ పక్కలో పడుకోరుగదా-అందుకని! ఈ విషయం నాకెప్పుడో తెలుసు. నాన్న బామ్మను అమ్మా అని పిలుస్తాడా-కానీ పెద్దాడై పోయాడుగదా-ఎప్పుడూ పక్కలో పడుకోడు.

నాకు లతని పెళ్ళి చేసుకోవాలనుందికానీ పెద్దవ్వాలంటే భయంగానూ ఉంది. అప్పుడప్పుడైనా అమ్మ పక్కలో పడుకోకుండా-ఎలా?

"సరేలే-పెద్దయ్యాక చూద్దాం-" అన్నాను.

"మరి పెద్దయ్యాక కట్నంగానీ అడగవ్వుకదా-" అంది లత.

"కట్నమా?" అన్నాను. అప్పుడు గుర్తుకొచ్చింది కట్నమంటే పెళ్ళిళ్ళు ఆపేసే మంత్రం. ఆ మంత్రాన్ని దుర్మార్గులైన మాంత్రికులు వేస్తుంటారు.

"మరి నేను మాంత్రికుణ్ణి కాదుగా-ఆ మంత్రాన్నెప్పుడూ వెయ్యను. ఎవరైనావేస్తే విరుగుడు మంత్రంకూడా నాకు తెలుసు - అన్నాను-" గర్వంగా.

"నువ్వు చాలా గొప్పవాడివిరా నానీ! అని వెళ్ళిపోయింది లత.

అది నిజమో అబద్ధమో తెలియదుకానీ ఆ తర్వాత మాయింట్లోవాళ్లు, లత యింట్లోవాళ్ళుకూడా నేను చాలా గొప్పవాణ్ణని పొగిడేశారు.

వాళ్ళంతా నన్ను నిజంగానే పొగిడేశారు. ఎందుకంటే వాళ్ళు నేనొక్కడినే ఉన్నప్పుడుకూడా ఎవరూ చూడకపోయినా పొగిడేశారు.

నేను నిజంగానే మాంత్రికుణ్ణి జయించానుగా - ఈవిషయం చిన్నిగాడికి ఉత్తరం రాయాలనుకున్నాను. అందుకని అప్పుడు లత అర్థంచేసుకుని చదివింది-ఆ భాషలోనే ఓ ఉత్తరం రాసి-అమ్మ దొడ్డకుత్తరం రాసినప్పుడు ఆ కవర్లో పెట్టాను.

అమ్మ నా ఉత్తరం చూసింది-"ఏమిట్రా ఈ పిచ్చిగీతలు...." అంది.

"అందులో ఏముందో తెలుసుకోవాలంటే లత నడుగు. నా భాష దాని కర్థమవుతుంది. మరి నేను చాలా పెద్దవాణ్ణిగా-అన్నాను.

వెంటనే నన్ను అమ్మ దగ్గరగా తీసుకుంది. అప్పుడు నేను ఏదో లోకంలోకి వెళ్ళిపోయాను. అలా నాకెంతో బాగుంది.

"అమ్మా! నేను చిన్నవాడిగానే ఉండిపోతానే-" అన్నాను. నే నెప్పుడు పెద్దవాణ్ణవుతానా అని నాకోసం లత ఎదురుచూస్తోంది. అయినాసరే ఈ సుఖం నేను వదులుకోలేనుగా.

అమ్మ నన్ను మరింత దగ్గరగా హత్తుకుంది. నేనేమో అమ్మను బల్లిలా కరుచుకుపోయాను. త్వరగా పెద్దవాడినైపోతానేమోనన్న భయంతప్ప ఇంకేమీ లేదప్పుడు నా మనసులో....

(అయిపోయింది)